బుధవారం
04-01-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 193
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

లక్ష్యంగా చేసుకుంటే దీటైన బదులిస్తాం

కోవిడ్ విజృంభణ భయంతో ఏ దేశానికి ఆ దేశం విదేశీ ప్రయాణికులకు కోవిడ్ పరీక్షలు తప్పనిసరి చేసింది. ముఖ్యంగా చైనా ప్రయాణికులపై ఆంక్షలు విధించడంపై చైనా ఘాటుగా స్పందించింది.

2లో

ప్రజాందోళనలపై ఉక్కుపాదం

- తొక్కిసలాట సాకుతో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు
- ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే సభలు... ర్యాలీలు
- రోడ్డు మార్జిన్లకు నిబంధనల వర్తింపు
- ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రదేశాల ఎంపిక
- అరుదైన సందర్భాల్లో షరతులతో అనుమతి
- రాష్ట్ర హోంశాఖ వివాదాస్పద ఉత్తర్వులు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలో రోడ్ షోలు, సభలు, ర్యాలీలను నియంత్రించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. నెల్లూరు జిల్లా కందుకూరు, గుంటూరులో వరుసగా జరిగిన తొక్కిసలాట ఘటనల సాకుతో ప్రజా వ్యతిరేకతను, ఆందోళనలను అణచివేసేందుకు, ప్రతిపక్షాల పీక నొక్కేందుకు ఇదే అదనుగా రాష్ట్ర హోంశాఖ అత్యంత వివాదాస్పద మార్గదర్శకాలు జారీచేసింది. దీనిప్రకారం ఇకపై మున్సిపల్, పంచాయతీ రహదారులు, రోడ్డు మార్జిన్ల వద్ద పోలీసు యాక్ట్ నిబంధనలు అమలు చేయనున్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డు షోలు నిర్వహించకుండా చూడాలని హోంశాఖ తన ఆదేశాల్లో పేర్కొంది. రోడ్డుకు దూరంగా, ప్రజలకు ఇబ్బందిలేకుండా సభలు, రోడ్డు షోలు నిర్వహించేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాలు ఎంపిక చేయాలని అధికారులకు సూచించింది. ఎంపిక చేసిన ప్రదేశాల్లోనే సభలు, ర్యాలీలు జరిగేలా చూడాలని స్పష్టం చేసింది. అత్యంత అరుదైన సందర్భాల్లో మాత్రమే షరతులతో కూడిన అనుమతి ఇవ్వనున్నట్లు పేర్కొంది. రాష్ట్ర రహదారులపై బహిరంగ సభలు, ర్యాలీలను పూర్తిగా నిషేధించింది. జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులపైన, మార్జిన్లలోనూ సభలు, ర్యాలీలకు అనుమతించేది లేదని స్పష్టంచేసింది. అత్యంత అరుదైన సందర్భాల్లో ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు కచ్చితమైన షరతులతో అనుమతి ఇవ్వొచ్చని మినహాయింపునిచ్చింది.

బ్రిటీషుకాలం నాటి 1861 పోలీస్ చట్టం ప్రకారం హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీశ్ కుమార్ గుప్తా సోమవారం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఈ ఉత్తర్వులు జారీ చేశారు. రోడ్లపై బహిరంగ సభలు, ర్యాలీలతో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తుండటంతోపాటు వాటి నిర్వహణలో లోటుపాట్లు, నిర్వాహకుల నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను బలిగొంటున్న నేపథ్యంలో 30 పోలీస్ యాక్ట్‌ను అమలు చేస్తూ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. జాతీయ, రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీరాజ్ రహదారులు పూర్తిగా ప్రజల రాకపోకలు, సరుకు రవాణా కోసం మాత్రమే ఉపయోగించాలని స్పష్టం చేసింది. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో సభల నిర్వహణకు ప్రత్యామ్నాయ ప్రదేశాలు ఎంపిక చేయాలని జిల్లాల ఉన్నతాధికారులకు సూచించింది. వివిధ పార్టీలు, ఇతర సంస్థలు తమ సభలను అధికారులు ఎంపిక చేసిన ప్రదేశాల్లో నిర్వహించుకోవచ్చని సూచించింది.

ప్రతిపక్షాల గొంతునొక్కే కుట్ర

- సభలకు షరతులపై విపక్షాల మండిపాటు
- జీవో కాపీల దహనం

విశాలాంధ్ర-విజయవాడ:
బ్రిటీష్ పాలకులు జాతీయోద్యమాన్ని అడ్డుకోవటం కోసం తీసుకువచ్చిన చట్టాన్ని స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నూతన సంవత్సర కానుకగా జీవో నంబరు 1 విడుదల చేసిందని ప్రతిపక్షాల నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రతిపక్షాల గొంతునొక్కేందుకే ఈ జీవో తెచ్చిందని విమర్శించారు. జీఓ కాపీలను సీపీఐ రాష్ట్ర కార్యాలయం దాసరి భవన్ వద్ద దహనం చేసి నిరసన తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ బ్రిటీష్ చట్టాలను ఇప్పుడు అమలు

- మిగతా 2 లో

ఆ జీవో దుర్మార్గం

నియంతలా వ్యవహరిస్తున్న జగన్

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుగ్లక్, హిట్లర్‌ల మాదిరిగా నియంత పాలనకు తెరతీశారనీ, ర్యాలీలు, సభలు, రోడ్‌షోలు, సమావేశాలకు అనుమతి నిరాకరిస్తూ జీవో విడుదల చేయడం దుర్మార్గమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. విజయవాడ దాసరి నాగభూషణరావు భవన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ...పోలీస్ యాక్ట్ 1861 సెక్షన్ 3 ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో ర్యాలీలు, రోడ్‌షోలు, సభలు, సమావేశాలు జరపకూడదంటూ రాష్ట్ర ప్రభుత్వం అర్ధరాత్రి చీకటి జీవో విడుదల చేసిందన్నారు. కందుకూరు, గుంటూరులలో జరిగిన ప్రమాద ఘటనలను సాకుగా చూపిస్తూ ఈ జీవో తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి తీవ్ర విఘాతమన్నారు. ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు ధర్నాలు, నిరసనలు, ర్యాలీలు చేయకుండా అడ్డుకునేందుకు జగన్ దుష్టబుద్ధితో ఆలోచిస్తున్నారనీ, పోలీసులను ప్రయోగించి ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయడం ద్వారా బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. స్వాతంత్ర్యానికి పూర్వం బ్రిటీష్‌వారు చేసిన పోలీస్‌యాక్ట్‌లో సెక్షన్లను ఉదహరిస్తూ వైసీపీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా ఉత్తర్వులివ్వడాన్ని తప్పుబట్టారు. గత ఎన్నికలకు ముందు జగన్, షర్మిల ఓదార్పుయాత్ర, పాదయాత్రలు చేయలేదా? ప్రత్యేక పరిస్థితుల్లో సభల నిర్వహణకు అనుమతిస్తామంటున్నారనీ, వైసీపీ శ్రేణులకు మాత్రమే ప్రత్యేక పరిస్థితులు వర్తిస్తాయా? అని ప్రశ్నించారు. జగన్ అధికారం చేపట్టాక ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలపై నిర్బంధకాండను ప్రయోగిస్తూ నియంతలా వ్యవహరిస్తున్నారని

- మిగతా 2 లో

- ప్రతిపక్షాలపై ఉక్కుపాదం
- రోడ్ షో, సభలు, ర్యాలీల నిషేధం
- జగన్ సర్కారు అడ్డగోలు జీవో జారీ
- చంద్రబాబు, లోకేశ్, పవన్ రోడ్ షోలకు అడ్డంకి
- వామపక్ష, ఉద్యోగ సంఘాల నిరంతర ఉద్యమాలకు బ్రేక్!

అణచివేతకేనా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ప్రతిపక్షాల ఉద్యమాలపై అణచివేతకు జగన్ సర్కారు మరో కుట్రకు తెరలేపింది. రోడ్ షో సభలు, ర్యాలీలకు నిరాకరిస్తూ తాజాగా రాష్ట్ర హోం శాఖ జీవో జారీ చేయడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఆ జీవో అమలు చేయడమంటే ప్రజలు, ప్రతిపక్షాలు, ప్రజాతంత్రవాదుల నోరు నొక్కే ప్రయత్నమేనని మండిపడుతున్నాయి. రోడ్‌షో సభలు, ర్యాలీలను నియంత్రించే జీవోపై ప్రతిపక్షాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. జగన్ సర్కారుపై నిరంతరం వస్తున్న వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకుగాను ఏదొక సాకుచూపి... అడ్డగోలుగా జీవో జారీ చేయడాన్ని ప్రజాతంత్రవాదులు, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, పౌరహక్కుల సంఘాలు, న్యాయకోవిదులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. విద్యార్థి, యువజన, నిరుద్యోగ సంఘాలు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలు తప్పుపడుతున్నాయి. ఇటీవల నెల్లూరు జిల్లా కందుకూరు, గుంటూరు జిల్లాల్లో టీడీపీ సభల్లో జరిగిన తొక్కిసలాట మృతులను సాకుగా తీసుకుని, జగన్ సర్కారు ఏకంగా ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు సిద్ధమైంది. దానిని రాజకీయ కోణంలో చూస్తూ, ఏకంగా మిగిలిన పార్టీల నేతలెవ్వరూ సభలూ, ర్యాలీలు నిర్వహించకూడదన్న పెత్తందారీ విధానాలకు తెరలేపింది. టీడీపీ సభలలో తొక్కిసలాట ఘటనలపై సీబీఐతో దర్యాప్తు చేయాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. 2024 ఎన్నికలకు

- మిగతా 2 లో

అక్కడ డోలీయే అంబులెన్స్!

గర్భిణిని 24కి.మీ. మోసి ఆస్పత్రికి తరలించిన మహిళలు

2లో

చిన్న కుటుంబమైనా చింతే!

- భారీగా పెరిగిన నిత్యావసరాలు... సేవల ధరలు
- ఇంటిని నడపాలంటే రెట్టింపైన ఖర్చు
- ఇద్దరు సంపాదించినా జేబుకి, పర్సుకు చిల్లే!
- కొత్త ఏడాదిలోనూ సామాన్యులకు చుక్కలే

న్యూఢిల్లీ :
దేశంలో నిత్యావసర ధరలు నింగినంటాయి. కూరగాయలు, పాలు నుంచి బియ్యం, ఇతర ఆహార వస్తువుల ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. కొత్త ఏడాదిలో కూడా సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలు నడుపుతున్న ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. కుటుంబాన్ని పోషించే యజమాని ఇతర వస్తువులు, సేవలపై తమ ఖర్చులను సర్దుబాటు చేయడం ద్వారా ప్రతి నెల ప్రారంభంలో నిత్యావసర వస్తువులను కొనుగోలు చేయడానికి కచ్చితమైన మొత్తాన్ని లెక్కించి కేటాయించే రోజులు పోయాయి. నిత్యావసరాల ధరలు వారి జేబుకు చిల్లు పెడుతున్నాయి. ఇప్పుడు దృశ్యం చాలా భిన్నంగా ఉంది. ఇద్దరు లేదా ముగ్గురు సభ్యులు ఉన్నప్పటికీ, ఒక చిన్న కుటుంబానికి అవసరమైన

- మిగతా 2 లో

హోదా, విభజన హామీల కోసం 20 నుంచి బస్సుయాత్ర

హిందూపురం నుంచి ఇచ్ఛాపురం వరకు...

విద్యార్థి, యువజన సంఘాల నిర్ణయం

విద్యార్థులు, యువత ముందుకు రావడం సంతోషం: రామకృష్ణ

రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ:
పోరాటంతోనే రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన హామీలు సాధించుకుందామని నాయకులు పిలుపునిచ్చారు. ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన కోసం విద్యార్థి, యువజన సంఘాలు, ప్రత్యేకహోదా సాధన సమితి అధ్వర్యంలో మంగళవారం విజయవాడ దాసరి భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల

- మిగతా 2 లో

ఇదీ లోకం!

నిజమే అయ్యుండొచ్చు! అంతకు ముందు నేను ఆ ఇంట్లో వుండేవాడిని!

విద్వేష ప్రసంగాలు... రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడి

సుప్రీంకోర్టు జడ్జి నాగరత్న

విద్వేష ప్రసంగం మన రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. మంత్రుల విద్వేష వ్యాఖ్యలు, ప్రసంగాలను ఆ ప్రభుత్వం చేసినవిగానే పరిగణిస్తారన్నారు.

2లో

'ఆనం' అవుట్

- వైసీపీ క్రమశిక్షణా చర్యలు
- వివాదాస్పద వ్యాఖ్యల ప్రభావం
- వెంకటగిరి ఇన్‌ఛార్జ్‌గా నేదురుమల్లి రామ్‌కుమార్
- పర్చూరుకు 'ఆమంచి' నియామకం

2లో

నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి వైసీపీ అధిష్ఠానం గట్టిషాక్ ఇచ్చింది. వెంకటగిరి సమన్వయకర్తగా వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌ను నియమించింది.

10న నేపాల్‌లో బలపరీక్ష

నేపాల్ నూతన ప్రధాని పుష్పకమల్ దహాల్ (68) బలపరీక్షకు అంగీకరించారు. దీంతో ఈనెల 10న పార్లమెంటులో విశ్వాస ఓటింగ్ జరగనున్నది.

2లో

లక్ష్యంగా చేసుకుంటే దీటైన బదులిస్తాం

మా ప్రయాణికులపై కోవిడ్ ఆంక్షలు ఆక్షేపణీయం : చైనా

బీజింగ్: కోవిడ్ విజృంభణ భయంతో ఏ దేశానికి ఆ దేశం విదేశీ ప్రయాణికులకు కోవిడ్ పరీక్షలు తప్పనిసరి చేసింది. ముఖ్యంగా చైనా ప్రయాణికులపై ఆంక్షలు విధించడంపై చైనా ఘాటుగా స్పందించింది. ఇది ఆక్షేపణీయమని, వివక్షపూరితమని నిందించింది. తమ దేశం నుంచి వచ్చే వారినే లక్ష్యంగా చేసుకుంటే దీటైన బదులిస్తామని హెచ్చరించింది. అమెరికా, జపాన్, బ్రిటన్, ఇటలీ, దక్షిణ కొరియా, భారత్ వంటి కొన్ని దేశాలు చైనా నుంచి వచ్చేవారంతా కోవిడ్ నెగటివ్ ధ్రువీకరణ పత్రంతో రావాలని ఆదేశాలు జారీచేశాయి. దీంతో చైనా విదేశాంగ శాఖ అధికారి మావో నింగ్ మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కేవలం తమ దేశ ప్రయాణికులను లక్ష్యంగా చేసుకోవడం ఆక్షేపణీయమని అన్నారు. ఇదే పద్ధతి కొనసాగితే దీటైన బదులిస్తామని

హెచ్చరికలు చేశారు. శాస్త్రీయ ఆధారాలు లేకుండా అనుచిత పద్ధతులను కొందరు అనుసరిస్తున్నారని ఆరోపించారు. ప్రయాణికులపై కొత్త నిబంధలు వివక్షపూరితంగా ఉన్నాయని కూడా బీజింగ్ పేర్కొంది. ఇదిలావుంటే, చైనా హెచ్చరికలను ఫ్రాన్స్ బేఖాతరు చేసింది.

తమ విధిధర్మానికి కట్టుబడి వ్యవహరిస్తున్నట్లు తెలిపింది. తమ దేశానికి వచ్చే చైనాతో పాటు విదేశీయులు తప్పనిసరిగా కోవిడ్ పరీక్షలు చేయించుకొని నెగటివ్ రిపోర్టుతో రావాలని పేర్కొంది. ఈ మేరకు ఫ్రాన్స్ ప్రధాని ఎలిజబెత్ బార్న్ మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. వైద్య నివేదికలను కోరుతూ తమ కర్తవ్యమని, సమీప భవిష్యత్‌లోనూ తమ పద్ధతి మారబోదని ఆమె తేల్చిచెప్పారు.

విశాలాంధ్ర ప్రపంచం

10న నేపాల్‌లో బలపరీక్ష

ఖాట్మండు: నేపాల్ నూతన ప్రధాని పుష్పకమల్ దహాల్ ప్రచండ (68) బలపరీక్షకు అంగీకరించారు. దీంతో ఈనెల 10న

పార్లమెంటులో విశ్వాస ఓటింగ్ జరగనున్నది. ఏడు పార్టీల మద్దతు ఆయనకున్నది. 138 ఓట్లు వస్తే ప్రచండకు సంపూర్ణ మెజారిటీ లభిస్తుంది. ఆయన గతేడాది డిసెంబరు 26న నేపాల్ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం విదితమే. ఎన్నికలకు ముందు ఏర్పడిన కూటమి నుంచి వైదొలగిన సీపీఎన్-మావోయిస్టు సెంటర్ అధినేత ప్రచండ అనంతరం విపక్ష నేత కేపీ శర్మఓలీతో చేతులు కలిపి ప్రధాని పగ్గాలను చేపట్టారు. దీంతో ఆయన నేపాల్‌కు మూడోసారి ప్రధాని కాగలిగారు. ఈనెల 10న బలపరీక్ష గురించి సభ్యులకు తెలిపాలని పార్లమెంటు కార్యదర్శిని ప్రచండ కోరారని ఓ అధికారి తెలిపారు.

చైనా, బ్రెజిల్ వ్యూహాత్మక భాగస్వాములు: జిన్‌పింగ్

బీజింగ్: బ్రెజిల్ నూతన అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసిన లులా డా సిల్వాకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ శుభాకాంక్షలు తెలిపారు. చైనా, బ్రెజిల్ దేశాలు అంతర్జాతీయస్థాయిలో ఆవిర్భవిస్తున్న కీలక మార్కెట్లన్నారు.

తమవి సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య దేశాలన్నారు. ఉమ్మడి ప్రయోజనాలు, అభివృద్ధి బాధ్యతలను పంచుకుంటున్నట్లు తెలిపారు. 48ఏళ్ల కిందట బ్రెజిల్-చైనా మధ్య దౌత్యబంధం ఏర్పడిందని, ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయని గుర్తుచేశారు. రెండు దేశాలు ఒకరికి ఒకరం అన్నట్లు ఉంటూ... పరిపక్వతతో డైనమిక్ వ్యవహరిస్తూ ఎంతో పురోగతి సాధించాయని జిన్‌పింగ్ అన్నారు. చైనా-బ్రెజిల్ సంబంధాలు రెండు అభివృద్ధి చెందుతున్న దేశాల మధ్య బంధానికి నమూనాగా నిలిచాయని చెప్పారు. చైనా-బ్రెజిల్ మధ్య సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత పటిష్టం కావాలని ఆకాంక్షించారు. రెండు దేశాల మధ్య దౌత్య బంధం తనకెంతో ప్రధానమని చెప్పారు. బహుపాక్షిక సహకారాన్ని, ఉన్నత స్థాయి భాగస్వామ్యాన్ని బలపర్చుకుంటూ తమ పౌరులకు దీర్ఘకాల ఫలాలు అందించేందుకు చైనా-బ్రెజిల్ కలిసి పనిచేస్తాయని జిన్‌పింగ్ అన్నారు.

ద్వైపాక్షిక సంబంధాల పునరుద్ధరణకు ఐక్యకృషి: చిలీ, బ్రెజిల్ సంకల్పం

శాంటియాగో డీ చిలీ: చిలీ, బ్రెజిల్ దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించాలని రెండు దేశాల అధ్యక్షులు సంకల్పించారు. గతంలోకంటే మరింత పటిష్టవంతంగా తమ బంధం ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు బ్రెజిల్ నూతన అధ్యక్షుడు లులా డా సిల్వాతో భేటీలో చిలీ అధ్యక్షుడు గేబ్రియల్ బోరిక్ అన్నారు. కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. భేటీ అనంతరం విలేకరుల సమావేశంలో బోరిక్ మాట్లాడుతూ, చైనా-బ్రెజిల్ ద్వైపాక్షిక బంధానికి పునర్వైభవం తీసుకొచ్చేందుకు తామిద్దరం కట్టుబడి ఉన్నామని చెప్పారు. తన బ్రెజిల్ పర్యటన ఫలప్రదమైనట్లు తెలిపారు. కాగా, చిలీ, అర్జెంటైనా, పారాగ్వా, బ్రెజిల్‌ను కలిపే అట్లాంటిక్-పసిఫిక్ మహాసముద్రల 'బై ఓషియనిక్ కారిడార్' ప్రాజెక్టును తమ రెండు సంయుక్తంగా చేపడుతున్నట్లు వెల్లడించారు. వలసలు, తప్పుడు ప్రచారంపై పోరు, విద్యుత్/చమురు సంక్షోభం తదితర అంశాలపై బోరిక్-లులా చర్చించినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

విద్వేష ప్రసంగాలు... రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడి

న్యూఢిల్లీ: విద్వేష ప్రసంగం మన రాజ్యాంగ ప్రాథమిక విలువలపై దాడేనని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న అన్నారు. మంత్రుల విద్వేష వ్యాఖ్యలు, ప్రసంగాలను ఆ ప్రభుత్వం చేసినవిగానే పరిగణిస్తారన్నారు. పౌరహక్కులకు విరుద్ధంగా నేతలు చేసే వ్యాఖ్యలను ప్రభుత్వానికి ఆపదించలేమన్న జస్టిస్ ఎస్ఏ నజీర్, జస్టిస్ బీఏ గవాయి, జస్టిస్ ఏఎస్ బొప్పన్న, జస్టిస్ రామసుబ్రమణియన్‌తో కూడిన రాజ్యాంగ ధర్మాసనం వెలువరించిన తీర్పుపై జస్టిస్ నాగరత్న అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈమధ్య కాలంలో విద్వేష-అవమానకర వ్యాఖ్యల పరంపర సాగుతోందన్నారు. విద్వేష వ్యాఖ్యలు రాజ్యాంగ ప్రాథమిక విలువులపై దాడి... సామాజిక సమానత్వానికి దెబ్బ... వేర్వేరు నేపథ్యాలవారిని అవమానించడమే అని ఆమె అన్నారు. బహుళత్వం-భిన్న సంస్కృతులకు భారత్ ప్రతీకని, ప్రతి ఒక్కరి గౌరవమర్యాదలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంటుందని జస్టిస్ నాగరత్న అన్నారు. ప్రజాప్రతినిధులు, సెలబ్రిటీలు బాధ్యతయుతంగా మాట్లాడాలని, తమ మాటల ప్రభావం తోటివారిపై ఏ విధంగా ఉంటుందో బేరీజు వేసుకోవాలని హితవుపలికారు. మంత్రుల మాటలను పార్టీలే కట్టడి చేయాలని, అందుకోసం ప్రవర్తనా నియమావళి అమలు చేయాలని ఆమె సూచించారు. నేతలు బాధ్యతగల పౌరుడిగా మాట్లాడటాన్ని అలవాటు చేసుకోవడం వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. ఇందుకోసం చట్టాలు తేవడం పార్లమెంటు బాధ్యతని జస్టిస్ నాగరత్న అన్నారు. ఆరోగ్యకర ప్రజాస్వామ్యంలో భావప్రకటన హక్కు ఎంతో ముఖ్యమని నొక్కిచెప్పారు. 2016 జులైలో యూపీలోని బుందేల్‌షహర్‌లో తన భార్య, కుమార్తెపై సామూహిక అత్యాచారం జరిగినట్లు ఓ వ్యక్తి పెట్టిన కేసును న్యాయస్థానం విచారించింది. సామూహిక అత్యాచారం 'రాజకీయ కుట్ర' అని ఉత్తరప్రదేశ్ మంత్రి ఆజం ఖాన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై ఎఫ్ఐఆర్ నమోదు, ఈ కేసు ఢిల్లీకి బదిలీ చేయాలని ఫిర్యాది కోరారు. ఇదే క్రమంలో నేతల భావప్రకటన పరిధిపై ప్రశ్న ఉత్పన్నం కాగా జస్టిస్ నాగరత్న పై విధంగా స్పందించారు.

ప్రైవేటీకరణపై విద్యుత్ ఉద్యోగుల నిరసన

ముంబై: విద్యుత్ కంపెనీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మూడు ప్రభుత్వ రంగ విద్యుత్ కంపెనీల ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమయ్యారు. బుధవారం నుంచి 72 గంటల పాటు సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. విద్యుత్ ఉద్యోగులు సమ్మె చేస్తామని హెచ్చరించినట్లు అధికారి ఒకరు మంగళవారం తెలిపారు. విద్యుత్ కంపెనీ యూనియన్ల కార్యాచరణ కమిటీ మహారాష్ట్ర రాజ్య కర్మచారి, అధికారి, అభియంత సంఘర్ష సమితి సమ్మెకు పిలుపునిచ్చింది. ప్రభుత్వరంగ విద్యుత్ కంపెనీల ప్రైవేటీకరణ ప్రయత్నాలను అడ్డుకునేందుకు 30 యూనియన్ల డ్రైవర్లు, వైర్‌మెన్, ఇంజినీర్లు ఏకతాటిపైకి వచ్చినట్లు మహారాష్ట్ర రాష్ట్ర విద్యుత్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి కృషన్ భోయిర్ పీటీఐకి తెలిపారు. మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(మహావితరన్), మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ ట్రాన్స్‌మిషన్ కంపెనీ లిమిటెడ్(మహాపరేశన్), మహారాష్ట్ర స్టేట్ ఎలక్ట్రిసిటీ జనరేషన్ కంపెనీ లిమిటెడ్(మహానిర్మితి) అనే మూడు ప్రభుత్వ రంగ విద్యుత్ కంపెనీలు. గడచిన మూడు వారాలుగా ఈ మూడు కంపెనీల ఉద్యోగులు ఆందోళనలు చేస్తున్నారని, 1500 మంది ఉద్యోగులు సోమవారం థానె కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసినట్లు కృషన్ భోయిర్ చెప్పారు.

ఆ జీవో దుర్మార్గం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో లేని విధంగా ఏపీలో నియంత పాలన సాగుతోందనడానికి ఈ జీవోనే నిదర్శనమన్నారు. రోడ్డు, రైలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రయాణాలు మానేస్తారా, మానుకోమంటారా? విశాఖ పారిశ్రామికవాడలో అనేక దఫాలుగా ప్రమాదాలు జరిగి, అనేక మంది మృతిచెందారు. అందువల్ల పరిశ్రమలను మూసివేసే జీవో తెస్తారా? అని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో 175 స్థానాలను వైసీపీ గెలుస్తుందనే మైండ్‌గేమ్ ఆడుతున్న జగన్‌కు ప్రతిపక్షాలు చేపట్టే కార్యక్రమాలంటే ఉలుకెందుకు? అని ఘాటుగా ప్రశ్నించారు. కందుకూరు, గుంటూరులలో జరిగిన ఘటనలపై ఏదైనా కుట్రకోణం దాగి ఉందేమోనన్న అనుమానం కలుగుతోందనీ, దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. నిఘా వర్గాలు, పోలీసుల వైఫల్యంపైనా విచారించి, బాధ్యులపై తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తక్షణమే చీకటి జీవోను ఉపసంహరించాలని, లేకుంటే అన్ని రాజకీయ పక్షాలను, ప్రజాసంఘాలను కలుపుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో నిరసన కార్యక్రమాలు చేపడతామని, హైకోర్టును కూడా ఆశ్రయిస్తామని రామకృష్ణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ పాల్గొన్నారు.

అక్కడ డోలీయే అంబులెన్స్!

విశాలాంధ్ర-పాడేరు(అల్లూరిజిల్లా): మన్యం ప్రజలకు కనీస ఆరోగ్య సేవలు కూడా కరువయ్యాయి. ప్రాణంమీదకొస్తే వైద్యం చేసే దిక్కులేకుండా పోయింది. అంబులెన్స్ సంగతి దేవుడెరుగు... కనీసం రోడ్డు కూడా లేకపోవడంతో నెలలు నిండిన గర్భిణులను డోలీ కట్టి కిలోమీటర్ల దూరం మోసుకెళ్లాల్సిన దుర్భర పరిస్థితి నెలకొంది. అధికారులు ప్రకటనలకు, వాస్తవ పరిస్థితికి పొంతనే లేదు. తాజాగా

అల్లూరి సీతారామరాజు జిల్లా కాంగెడ్డలో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం. పాడేరు మండలంల మోదాపల్లి పంచాయతీ కాంగెడ్డ గ్రామానికి చెందిన పాంగి జ్యోతి అనే గర్భిణికి పురిటి నొప్పులొచ్చాయి... అసలే మొదటి కాన్పు... వెంటనే ఆస్పత్రికి తరలించాల్సిన పరిస్థితి. రహదారి సదుపాయం లేకపోవడం, గ్రామంలో మగవారు కూడా అందుబాటులో లేనందున మహిళలే డోలీలో ఆమెను మూడు కిలోమీటర్ల దూరంలోని మినుములూరు పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. కానీ కాంగెడ్డ ఈదులపాలెం పీహెచ్‌సీ పరిధిలోకి వస్తుందని, ఇక్కడ సరైన సౌకర్యాలు లేవని, అక్కడే ప్రసవం చేయాలని ఆరోగ్య సిబ్బంది చెప్పడం గమనార్హం. దీంతె చేసేది లేక కాంగెడ్డ మహిళలు నొప్పులతో బాధపడుతున్న గర్భిణిని అక్కడ నుంచి డోలీలోనే 24 కిలోమీటర్ల దూరంలోని, ఈదులపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆసుపత్రిలో సుఖ ప్రసవం జరిగి పండంటి బిడ్డకు జన్మనిచ్చింది ఆ తల్లి. మార్గమధ్యంలో జరగరానిది జరిగితే ఎవరు బాధ్యులు? ప్రసవానికి ముందుగానే సమీపంలోని ఆసుపత్రులకు తరలించాలన్న వైద్య ఆరోగ్య అధికారులు, సిబ్బంది ఇచ్చే ఆదేశాలు ఆచరణలోకి రావడంలేదు. గిరిజన గ్రామంల్లో రహదారి సౌకర్యాలు కల్పించి మహిళల ప్రాణాలు కాపాడాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాలికి లక్కు డిమాండ్ చేశారు.

ప్రతిపక్షాల గొంతునొక్కే కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి చట్టాలు అమలు చేసి ఉంటే జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ఎలా చేసి ఉండేవారని ప్రశ్నించారు. జగన్ జైలులో ఉంటే ఆయన సోదరి షర్మిల రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేసిందని గుర్తు చేశారు. ప్రతిపక్షాలను చూసి ముఖ్యమంత్రి జగన్ భయపడుతున్నారని చెప్పారు. చలో అసెంబ్లీలకు అనుమతివ్వడం లేదన్నారు. ధర్నాకు వ్యవసాయ కార్మిక సంఘానికి అనుమతించి...విజయవాడ వచ్చిన తరువాత రైల్వేస్టేషన్‌లో అరెస్టు చేశారని గుర్తుచేశారు. కందుకూరు ఘటనపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. చంద్రబాబుపై కేసు పెట్టి విచారించాలన్నారు. కందుకూరు ఘటన సాకుతో బహిరంగ సభలకు అనుమతి నిరాకరించటం దారుణమన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి 40 మంది చనిపోయారని, అందువల్ల ఇక ప్రాజెక్టులు నిర్మించాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. ఉమ్మడి కృష్ణాజిల్లాలో కల్తీమద్యం తాగి 20 మంది చనిపోయారని, మరి మద్యం అమ్మకాలు ఎందుకు నిలిపివేయలేదని నిలదీశారు. ప్రతిపక్షాలను ఇబ్బందిపెట్టటానికే ఈ జీవో తెచ్చారని ఆరోపించారు. తక్షణం జీవో నంబరు 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజాఉద్యమాలకు భయపడి జీవో తీసుకుచ్చారని చెప్పారు. ఉద్యమాలు ఇది ప్రజాస్వామ్య హక్కని, ప్రభుత్వాలు మారుతుంటాయిగానీ రాజ్యాంగం కల్పించిన హక్కు మారదన్నారు. ఈ జీవోను రద్దు చేయాల్సిందేనని, అవసరమైతే దీనిపై ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ మాట్లాడుతూ ఇది ప్రజాస్వామ్య హక్కులను కాలరాయటమేనన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించటం చేతగాక...ప్రతిపక్షాల ఉద్యమాలను అణిచివేసేందుకు పాత చట్టాలు తీసుకువచ్చారని ఆరోపించారు.

మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ జగన్‌ది నియంతృత్వ పాలన అని, ప్రతిపక్షాలు లేకుండా చేసేందుకు ఈ జీవో తీసుకువచ్చారన్నారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి చైర్మన్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవోనంబరు 1 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, జి.ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గసభ్యులు దోనేపూడి శంకర్, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, నవతరం పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు రవిచంద్ర, సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి బస్సుయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులు పాల్గొన్నారు. ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శులు శివారెడ్డి, అశోక్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. ప్రత్యేకహోదా, విభజన హామీల సాధన కోసం యువజన, విద్యార్థి సంఘాల నాయకత్వాన రాష్ట్రవ్యాప్తంగా బసు యాత్ర చేపట్టాలని రౌండ్‌టేబుల్ సమావేశం నిర్ణయించింది. జనవరి 20న హిందూపురంలో ప్రారంభమైన బసుయాత్ర ఇచ్ఛాపురం వరకు 15 రోజులు కొనసాగుతుంది.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ హోదా, విభజన హామీల కోసం విద్యార్థి, యువజన సంఘాలు ఉద్యమం చేపట్టడం అభినందనీయమన్నారు. సీఎం జగన్ ఢిల్లీ పెద్దలకు వినతిపత్రాలు సమర్పిస్తున్నారు...వాటిని మీడియాకు విడుదల చేస్తున్నారు...కానీ ఆ విన్నపాలపై కేంద్రం ఏమి చెప్పిందో వెల్లడించడం లేదని విమర్శించారు. కేంద్రమైనా మాట్లాడుతుందా అంటే అదీ కనిపించడం లేదన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలపై విద్యారి, యువజన సంఘాలు దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులు, యువత ఉద్యమిస్తే తప్ప పాలకులు దిగిరారన్నారు. విద్యార్థి, యువజనులు చేపట్టిన బస్సుయాత్ర జనవరి 26న విజయవాడలో ఉండేలా షెడ్యూల్ రూపొందించుకోవాలని సూచించారు. రిపబ్లిక్ డే నాడు విజయవాడలో జాతీయ పతాకం ఎగురవేసి భారీఎత్తున డిమాండ్ చేస్తే దేశవ్యాప్తంగా ప్రాధాన్యత లభిస్తుందన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికల వేళ ప్రత్యేకహోదా డిమాండ్‌ను ప్రధాన పార్టీలు బయటకు తీస్తున్నాయని చెప్పారు. ప్రత్యేక హోదా కోసం ముఖ్యమంత్రి పోరాడి...ప్రధానమంత్రితో ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామిని నేరవేర్చుతారా? లేదా? అని నిలదీయాలన్నారు. హోదా ఉద్యమంలో బీజేపీ తప్ప అన్ని రాజకీయ పార్టీలు పాల్గొంటున్నాయని చెప్పారు. ప్రత్యేకహోదాపై కేంద్ర పెద్దలను నిలదీయాలని రాష్ట్ర బీజేపీ నాయకులను కోరారు. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ అశాస్త్రీయంగా పార్లమెంటులో రాష్ట్ర విభజన జరిగిన తీరుకు తానే ప్రత్యక్షసాక్షినని చెప్పారు. ప్రతిపక్ష పార్టీగా బీజేపీ డిమాండ్ చేస్తే పాలక పార్టీగా కాంగ్రెస్ హోదా హామీ ఇచ్చిందన్నారు. దీనిని మోదీ సర్కారు అమలు చేయడం లేదని విమర్శించారు. మిత్రపక్షంగా ఉండి కూడా 2014 నుంచి 2019 వరకు హోదాపై టీడీపీ పోరాడిందన్నారు. ఏపీలో పెట్టుబడులకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావడం లేదన్నారు. 22మంది వైసీపీ ఎంపీలు పార్లమెంటులో నోరెత్తడం లేదన్నారు. సీబీఐ కేసులకు భయపడుతున్నారని ఆరోపించారు.

ప్రత్యేక హోదా సాధన సమితి చైర్మన్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమంటూ పనికిమాలిన మాటలు చెబుతున్నారని మండిపడ్డారు. ప్రత్యేక హోదా ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు బస్‌యాత్ర ఉద్యమానికి ఆహ్వానించాలని సూచించారు. బస్‌యాత్రకు అనుమతి నిరాకరించినా మరో రూపంలోనైనా ఉద్యమంచాలని కోరారు. మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవానీ మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేసే చిత్తశుద్ధి పాలకులకు కరువైందన్నారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరిస్తున్నా సీఎం జగన్ మాట్లాడటం లేదన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ చంద్రబాబు వైఫల్యాలపై గట్టిపునాదులు వేసుకుని జగన్ పార్లమెంట్ వరకు ఎదిగారని చెప్పారు. జగన్ ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి చేసిందేమీ లేదని, కనీసం పులివెందులకు కూడా ఏమీ చేయలేకపోయారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, అక్కినేని వనజ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకర్, టీడీపీ నాయకులు లింగమనేని శివరామ్‌ప్రసాద్, నవతరం పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కరువది సుబ్బారావు, ఏఐటీయూసీ నాయకులు వెంకట సుబ్బయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, కార్యదర్శి నక్కి లెనిన్‌బాబు, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, పీడీఎస్‌యూ జాతీయ నాయకులు రవిచంద్ర, భాస్కర్, రాజేశ్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి వేముల శ్రీనివాసరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, నాయకులు శ్యామ్, సంతోశ్, కారుమంచి సుభాని, యుగంధర్, సుబ్బారావు, మోతుకూరి అరుణ్‌కుమార్, లంకా గోవిందరాజులు, ఎం.సాయికుమార్, షేక్ వలి, జంగాల చైతన్య, చీకటి సైదారావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రానాయక్, కోశాధికారి ఆర్.పిచ్చయ్య అభ్యుదయ గీతాలు ఆలపించి ఆకట్టుకున్నారు.

'ఆనం' అవుట్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: నెల్లూరు జిల్లా వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి వైసీపీ అధిష్టానం గట్టిషాక్ ఇచ్చింది. వెంకటగిరి సమన్వయకర్తగా వైసీపీ నేత నేదురుమల్లి రామ్‌కుమార్‌ను నియమించింది. పార్టీ అధ్యక్షులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగవారం వైసీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్తగా ఆమంచి కృష్ణమోహన్‌ను నియమించింది. కొంతకాలంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైసీపీ ఎమ్మెల్యే ఆనం ప్రకటనలు చేస్తున్నారు. ఇది స్థానిక వైసీపీ నేతలకు, అధిష్టానానికి మింగుడు పడటం లేదు. తాజాగా కూడా ఆయన ముందస్తు వస్తే ముందే పోతామంటూ బహిరంగ ప్రకటనలు చేయగా, ఆ మేరకు వైసీపీ అధిష్టానం ఆనంపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి నెల్లూరు జిల్లాకు చెందిన ముఖ్య నేతలను సీఎం జగన్ పిలిపించి, ఆనం వ్యాఖ్యలు, వ్యవహారంపై చర్చించారు. ఆనం నియోజకవర్గమైన వెంకటగిరి సమన్వయకర్తగా నేదురుమల్లి రామ్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రెండో విడత మంత్రివర్గ విస్తరణ సమయంలో ఆనంకు మంత్రి పదవి వస్తుందని ఆశించి ఆయన అనుచరులు భంగపాటుకు గురయ్యారు. దాంతోపాటు పార్టీలో ఆనంకు తగినంత ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ఇప్పటికే వైసీపీలో ఒక ఎంపీ రఘురామ కృష్ణరాజు తిరుగుబాటు చేయగా, ఆయన చెంతకు ఎమ్మెల్యే ఆనం చేరనున్నారు. వచ్చే ఎన్నికల్లో 175/175 సీట్లే లక్ష్యంతో సీఎం జగన్ ముందుకు వెళుతున్న సమయంలో ఆనంపై వేటు వేయడం వల్ల నెల్లూరు జిల్లాలో ఆ పార్టీపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది.

చిన్న కుటుంబమైనా చింతే!

(మొదటిపేజీ తరువాయి)

ఆహార నూనెలు, పప్పులు, పాలు, పెట్రోలు మొదలైన వాటిపై ఖర్చు చేసేటప్పుడు ఖర్చులను నియంత్రించడం కష్టం. ద్రవ్యోల్బణం పెరగడంతో సగటు భారతీయ కుటుంబాల కొనుగోలు శక్తి కూడా పడిపోయింది. గత ఏడాది భారత్‌లో ద్రవ్యోల్బణం కచ్చితంగా విధ్వంసం సృష్టించింది. ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసిన ప్రధాన కారకాల్లో ద్రవ్యోల్బణం కూడా ఒకటి. భర్త కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న ఇద్దరు పిల్లల తల్లి మీనాక్షి (46) ఒక ఆంగ్ల వార్తా సంస్థతో మాట్లాడుతూ కొంతకాలం క్రితం భోజన ఖర్చులకు రూ.5 వేలు సరిపోయేవి. ఇప్పుడు అవసరాలు తీర్చుకోవాలంటే రూ.10 వేలు కూడా సవాలు మొత్తమే. 'ఒకప్పుడు కిలో రూ.60-80కి విక్రయించే పప్పులు ఇప్పుడు కిలో రూ.130-150కి అమ్ముడవుతున్నాయి. ఇది దాదాపు రెట్టింపు అవుతుంది' అని తెలిపారు. 'ఇంతకుముందు 70-80 రూపాయలకు కొనుగోలు చేసే రిఫైన్డ్ నూనె ఇప్పుడు దాదాపుగా రూ.200 అమ్ముడవుతోంది' అని అన్నారు. 2000-01 ఆర్థిక సంవత్సరంలో కంది పప్పు క్వింటాల్‌కు రూ. 1,800గా ఉంది. 2022 ఆర్థిక సంవత్సరంలో క్వింటాల్‌కు రూ.5,820 ఖర్చవుతుంది. 21 సంవత్సరాలలో 224 శాతం ధర పెరిగింది. అదేవిధంగా, శనగ పప్పు 2000-01 ఆర్థిక సంవత్సరంలో క్వింటాల్‌కు రూ.1,400 నుంచి 2022 ఆర్థిక సంవత్సరంలో రూ.5,090కి చేరింది. అంటే, 263 శాతం పెరిగింది. సమీక్షలో ఉన్న కాలంలో మసూరు పప్పు, పచ్చి శెనగ, నల్ల శనగ ధర వరుసగా 340 శాతం, 253 శాతం, 264 శాతం పెరిగాయి. 2001లో రూ.1,000కి 59 కిలోల కందిపప్పు పొందేవారు. ఇప్పుడు అదే మొత్తానికి 16 కిలోలు మాత్రమే కొనుగోలు చేయవచ్చు. గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ డేటా ప్రకారం, మార్చి 2021తో పోలిస్తే మార్చి 2022లో ఆహార ధరలు 7.68 శాతం ఎక్కువగా ఉన్నాయి. వినియోగదారుల ఆహార ధరల సూచీ నవంబర్ 2020 తర్వాత ఇది రెండవ అత్యధిక ఆహార ద్రవ్యోల్బణం.

15 శాతం పెరిగిన బియ్యం ధర

దేశంలో బియ్యం, పామాయిల్ ఖరీదైనవిగా మారుతున్నాయి. గత నెలలో బియ్యం ధర 15 శాతం వరకు పెరగ్గా, పామాయిల్ ధర రూ.5 నుంచి రూ.7 వరకు పెరగనుంది. బాస్మతి రకం బియ్యం కిలో రూ.95 ఉండగా రికార్డు స్థాయిలో రూ.110కి అమ్ముడవుతోంది. పాకిస్తాన్‌లో వరదల కారణంగా దేశంలోని వరి పంట దెబ్బతినడంతో ప్రపంచ మార్కెట్‌లో మంచి ధరలు వస్తాయని ఊహించి రైస్ మిల్లర్లు నిల్వలు ఉంచుకోవడమే ఇందుకు కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఖరీఫ్ బియ్యం ఉత్పత్తిలో అంచనా తగ్గుదల, ప్రభుత్వం అమలు చేస్తున్న ఆహార భద్రతా పథకాన్ని ఉపసంహరించుకోవడం, నేపాల్‌కు పన్ను రహిత వరి ఎగుమతులు కారణంగా బాస్మతీయేతర బియ్యం ధరలు పెరుగుతున్నాయని నిపుణులు తెలిపారు. 2022-23లో ఖరీఫ్ బియ్యం ఉత్పత్తి 104.99 మిలియన్లుగా అంచనా వేశారు. ఇది 2021-22లో 111.76 టన్నుల కంటే 6.77 మిలియన్ టన్నులు తక్కువ.

అణచివేతకేనా?

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలో అన్ని పార్టీల నేతలు సిద్ధమయ్యారు. సీఎం జగన్ ప్రతి జిల్లాలోనూ భారీ సభలు నిర్వహిస్తున్నారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా వైసీపీ ఎమ్మెల్యేలు ర్యాలీలతో ప్రతి ఇంటా పర్యటిస్తున్నారు. ఆ సమయంలో చిన్నపాటి సభలూ, రోడ్ షోలూ నిర్వహిస్తున్నారు. అదే విధానం ప్రతిపక్షాలకూ జగన్ అమలు చేయకపోవడం విడ్డూరంగా ఉంది. ఎంపిక చేసిన ప్రదేశాల్లో మాత్రమే సభలు నిర్వహించుకోవాలంటూ జీవో జారీ చేయడాన్ని తప్పుపడుతున్నారు.

ప్రతిపక్షాల యాత్రల కార్యాచరణ.. జగన్ సర్కారులో ఆందోళన

ప్రతిపక్షాల వరుస వారీ యాత్రలు, రోడ్ షోల కార్యాచరణతో సీఎం జగన్ సర్కారుకు, వైసీపీ నేతలకు ఆందోళన మొదలైంది. ఎలాగైనా వారి ఉద్యమాన్ని అణచివేయాలన్న అక్కసుతో ప్రభుత్వం జీవో జారీచేసింది. రాష్ట్రంలో జనవరి 27వ తేదీ నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నారా లోకేశ్ యువగళం యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు 400 రోజులపాటు 4 వేల కిలోమీటర్ల మేర ఈ యాత్ర ప్రారంభం కానుంది. జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి పేరుతో యాత్రకు సిద్ధం కానున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు జిల్లాల వారీగా రోడ్ షోలు, సభలు నిర్వహిస్తున్నారు. వామపక్ష పార్టీలు నిరంతరం ఉద్యమంలో భాగంగా ర్యాలీలు, ధర్నాలు, సభలు నిర్వహిస్తుంటాయి. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణకు సిద్ధమయ్యారు. వాటిని కట్టడిచేయాలన్న కుట్రతో ప్రభుత్వం ఉన్న పళంగా జీవో జారీచేసిందన్న విమర్శలున్నాయి. గతంలో జగన్, షర్మిల పాదయాత్రకు అప్పటి ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించలేదు. జగన్ అధికారంలోకి వచ్చాక ప్రతిపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా వ్యవహరిస్తూ ఈ తరహా జీవో జారీ చేశారని ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. అటు ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక సంఘాలు చేపట్టిన చలో విజయవాడ నుంచి, ప్రభుత్వ ఉద్యోగులపై కక్ష సాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది. ఒకటో తేదీన వేతనాలు పడటం గగనంగా మారింది. దీంతో ఉద్యోగులంతా ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

జీవో జారీజేసిన రోజే సీఎం సభ

రోడ్ షో సభలు, ర్యాలీలను నిషేధిస్తూ, జీవో ఇచ్చిన రోజే... రాజమహేంద్రవరంలో అధికార వైసీపీ పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టగా, దానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరవడం చర్చనీయాంశంగా మారింది. ఒక వైపు అధికార పక్షం సభలు, సమావేశాలను నిర్వహించుకుంటూ, మరోవైపు ప్రతిపక్షాలు రోడ్ షో సభలు, ర్యాలీలు నిర్వహించకూడదంటూ రాష్ట్ర హోం శాఖ ద్వారా జీవో జారీ చేయడంపై ప్రతిపక్ష నేతలు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇప్పటికైనా సీఎం జగన్ ప్రభుత్వం స్పందించి తక్షణమే ఈ జీవోను ఉపసంహరించాలని, లేకుంటే ప్రత్యక్ష ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతామని ప్రతిపక్ష పార్టీలు హెచ్చరిస్తున్నాయి.

రోడ్ షోలు, ర్యాలీల నియంత్రణ జీవో ఉపసంహరించాలి: సీపీఎం

రాష్ట్రంలో రోడ్ షోలు, ర్యాలీలను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను తక్షణమే ఉపసంహరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే ఈ జీవో తీసుకొచ్చిందంటూ ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. పోలీసులకు సర్వాధికారాలు కట్టబెట్టడం ప్రజాస్వామ్య వ్యవస్థకే ప్రమాదమని, పోరాడి సాధించుకున్న పౌరహక్కులను ఏ పేరుతో అణచివేసినా సీపీఎం వ్యతిరేకిస్తోందన్నారు. కందుకూరు, గుంటూరు ఘటనలను ఆసరా చేసుకొని రాష్ట్ర, మున్సిపల్, పంచాయతీ రోడ్‌లలో సభలు, ర్యాలీలు, రోడ్ షోలు నిషేధించడం అప్రజాస్వామికమని తెలిపారు. రోడ్లపైన ర్యాలీలు, సభలు జరిపితే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయనుకుంటే గుంటూరులో గ్రౌండ్‌లో సభ జరిపినప్పటికీ దుర్ఘటన జరగడం, పోలీసు వైఫల్యం స్పష్టంగా కనపడుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రజాస్వామ్య, పౌరహక్కులను కాలరాయడానికి ఇలాంటి జీవో తీసుకురావడం గర్హనీయమన్నారు. ఊరికి దూరంగా ప్రజలతో సంబంధం లేకుండా సభలు జరుపుకోవడం తగదని, ప్రధాన పట్టణాలలో సభలు జరుపుకోడానికి అవసరమైన మైదానాలను కేటాయించాలని, ప్రదర్శనలకు అనుమతినివ్వాలని డిమాండ్ చేశారు.

బ్రిటీష్ కాలం చట్టం ద్వారా ఆంక్షలా ?: జనసేన నేత నాదెండ్ల మనోహర్

బ్రిటీష్ కాలం నాటి చట్టం ద్వారా రాష్ట్రంలో రాజకీయ పార్టీలను నియంత్రించాలన్న ఉద్దేశంతో రోడ్ షో సభలు, ర్యాలీలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని జనసేన నేత నాదెండ్ల మనోహర్ తీవ్రంగా వ్యతిరేకించారు. వైసీపీ ప్రభుత్వ నిరంకుశ ధోరణి మరోసారి వెల్లడైందన్నారు. ఆర్టీసీ బస్సులను పార్టీ కార్యక్రమాలకు మళ్లిస్తున్నారని మండిపడ్డారు. విజయవాడ బెంజిసర్కిల్‌లో సీఎం వైఎస్ జగన్... సభకు అన్ని మార్గాలను మూసేసి చెత్త సేకరించే వాహనాలకు, రేషన్ వాహనాలకు జెండా ఊపలేదా? అని ప్రశ్నించారు. శాంతిభద్రతల పేరుతో హక్కులు కాలరాయడం రాజ్యాంగ ఉల్లంఘనేనని ఖండించారు.

మాది పేదల పక్షపాత ప్రభుత్వం

- అర్హులందరికీ పింఛన్లు అందిస్తాం
- మూడున్నరేళ్లలో రూ.62 వేల కోట్లు ఇచ్చాం
- రాజమహేంద్రవరం సభలో సీఎం జగన్



విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల పక్షపాత ప్రభుత్వం అని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పేదలు, రైతులు రాష్ట్ర ప్రభుత్వానికి రెండు కళ్లు అని చెప్పారు. ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి రాగానే రూ.2000గా ఉన్న పింఛన్ మొత్తాన్ని ఏటా రూ.250 పెంచుతూ వస్తున్నామని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో పింఛన్ల కోసం అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి నుంచి వలంటీర్లు ఫించన్ దారుల ఇంటి వద్దకే ఇచ్చే పరిస్థితి తెచ్చామన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో మంగళవారం వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం లబ్ధిదారులతో నిర్వహించిన సభలో సీఎం జగన్ మాట్లాడారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి పింఛన్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. లంచాలు లేని పాలనతో వ్యవస్థలో సమూల మార్పులు తెచ్చామన్నారు. పింఛన్ మొత్తాన్ని రూ. 2,500 నుంచి రూ.2,750కి పెంచి ఖర్చుకు వెనకాడకుండా లబ్ధిదారుల సంక్షేమం కోసమే రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తోందని సీఎం జగన్ వెల్లడించారు. అవ్వా తాతలతో పాటు వితంతువులు, చేనేతలు, కల్లుగీత కార్మికులు, ఒంటరి మహిళలు, మత్స్యకారులు, సాంప్రదాయ వృత్తిపై ఆధారపడి ఉన్న చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రస్తుతం పెంచిన పింఛన్లు వర్తిస్తాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కేవలం 39 లక్షల మందికి మాత్రమే పెన్షన్ అందేదని వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 64 లక్షల మందికి పెన్షన్ ఇస్తున్నట్లు వివరించారు. మూడున్నరేళ్లలో పెన్షన్ల కోసం రూ. 62, 500 కోట్లు ఖర్చు చేశామని ప్రకటించారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా రూ.2,750 నుంచి రూ.10వేల వరకు అర్హులైన వారికి పింఛన్లు ఇస్తున్న ఏకైకా రాష్ట్రం మనదేనని సీఎం జగన్ ప్రకటించారు. పింఛన్లు కేవలం వృద్ధులకు మాత్రమే కాకుండా ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న అర్హులందరికీ తంచనుగా అందిస్తున్నామని తెలిపారు. కొత్తగా జారీ చేసిన పింఛన్లకు ప్రభుత్వం నిధులను వెంటనే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన బియ్యం కార్డులు, ఆరోగ్య శ్రీ కార్డులను వలంటీర్లు ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు అందిస్తున్నారని సీఎం ప్రకటించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల తరహాలో లబ్ధిదారులకు ఫించన్ ప్రయోజనం అందించే అంశంలో ఒక్క శాతం వివక్ష కూడా చూపడం లేదని సీఎం జగన్ పేర్కొన్నారు. అవినీతి, లంచాలు, పార్టీలు, కులం, మతం లాంటి వివక్షలకు తావులేదన్నారు. అర్హత ఉన్న ప్రతి అవ్వా తాతకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ ఇవ్వడం ప్రభుత్వ ప్రాథమిక భాధ్యతగా భావిస్తామన్నారు.

చంద్రబాబువి శవ రాజకీయాలు

చంద్రబాబు మొదటీ నుంచీ ఎన్టీఆర్‌ను అడ్డుపెట్టుకుని శవ రాజకీయాలు చేశారని ఇలాంటి ప్రతిపక్ష నేత ఉండటం రాష్ట్రానికి పట్టిన ఖర్మ అని సీఎం జగన్ విమర్శించారు. ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఎన్నికలప్పుడు మాత్రం ఎన్టీఆర్ ఫొటోకి దండ వేసి మహానుభావుడంటూ ఓట్లు అడుగుతారని విమర్శించారు. చంపేది చంద్రబాబే మళ్లీ మొసలి కన్నీరు కారుస్తూ డ్రామాలు ఆడతారని ఆరోపించారు. ఈ పెద్ద మనిషికి తెలిసిందల్లా వెన్నుపోటు పొడవడం, ఫొటోషూట్, డ్రామాలు ఆడటం, మొసలి కన్నీరు కార్చడం మాత్రమేనని నిజాయితీతో కూడిన రాజకీయాలు ఎన్నడూ చేయలేదని విమర్శించారు. చంద్రబాబు తన సభలకు రాని జనాలను ఎల్లో మీడియాలో వచ్చినట్లు చూపించి, ఇతర ప్రాంతాల ప్రజలను మభ్య పెట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, కందుకూరు సభలో జనం తక్కువ వస్తే ఎక్కువ మంది వచ్చారని చూపించేందుకు చిన్న రోడ్డులో ర్యాలీ నిర్వహించి ఎనిమిది మంది చనిపోవడానికి కారణమయ్యారని ఆరోపించారు. చంద్రబాబుకు ఎల్లో మీడియా దత్త పుత్రుడి అండ ఉంటే తనకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల అండ ఉందన్నారు. రాష్ట్రంలో పేదలకు పెత్తం దారులకు మధ్య జరిగే యుద్ధమే వచ్చే ఎన్నికలని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పేదల పక్షపాతిగా నిలబడుతుందని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో జరుగుతున్నది కులాల యుద్ధం కాదు... క్లాస్ ల యుద్ధమని, ఇందులో ఒకవైపు పేదవాడు, మరోవైపు పెత్తందారీ వ్యవస్థ ఉందని ఆయన అన్నారు. ఈ యుద్ధంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా పేదవాడు నాశనమైపోతాడన్న విషయాన్ని మర్చిపోరాదని చెప్పారు.

మిరప రైతుల్ని ప్రభుత్వం ఆదుకోవాలి

ఏపీ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్

విశాలాంధ్ర-కొరిశపాడు: బాపట్ల జిల్లా కొరిశపాడు మండలం పమిడిపాడులో మిరప చేలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ... ఇటీవల వర్షాలకు కొన్ని పంటలు దెబ్బతినగా మిరపను తామర పురుగు ఆశించిందని, చెట్టు ఎదుగుదల తప్ప పంట దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. అదేవిధంగా గత సంవత్సరంలో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, ఈ సంవత్సరం తీవ్రంగా పంట నష్టపోయిన రైతన్న కష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సరైన నష్టపరిహారాన్ని ఇప్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. పంట దిగుబడి రాని రైతులకు ప్రభుత్వం క్రిమిసంహారక మందులను ఉచితంగా ఇవ్వాలని కోరారు. మిరప రైతులకు ఇప్పటివరకు ఎకరాకు రూ. 70000 వరకు ఖర్చయిందని ఇప్పుడు రెండు క్వింటాళ్లు కూడా దిగుబడి రాని పరిస్థితి ఉందన్నారు. ఈ నష్టాన్ని అతగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని అన్నారు. పంట నష్ట పరిశీలనలో సీపీఐ కొరిశపాడు మండల కార్యదర్శి కూనంనేని నాగార్జున, రైతు సంఘం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, జే వీరయ్య, వ్యవసాయ శాఖ ప్రతినిధి సుష్మ, రైతులు పిన్నక సుబ్బారావు, సుభాషిణి, పిన్నక సుబ్బయ్య గోపి పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే తొక్కిసలాట

జగదీశ్ విమర్శ

విశాలాంధ్ర-అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం సరైన భద్రత కల్పించకపోవడంతోనే కందుకూరు, గుంటూరు తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ అభిప్రాయపడ్డారు. అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో పార్టీ మండలస్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం మంగళవారం జరిగింది. సీపీఐ మండల కార్యదర్శి రామదాసు అధ్యక్షత వహించారు. జగదీశ్ మాట్లాడుతూ కందుకూరు, గుంటూరులో జరిగిన తొక్కిసలాటలో మరణాలు ప్రభుత్వ హత్యలేనని వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష పార్టీల సభలకు హాజరవుతున్న ప్రజలకు తగిన రక్షణ కల్పించటంలో జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గుంటూరు, కందుకూరులో జరిగిన మరణాలకు సీఎం జగన్ పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ మరణాలను సాకుగా చూపుతూ సభలు, సమావేశాలు, రోడ్‌షోలపై నిషేధం విధిస్తూ 1861 పోలీస్ యాక్టు ద్వారా జీవో విడుదల చేయడం అప్రజాస్వామికమని తూర్పారబట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి నియంతలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సీపీఐ గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రయ్య, సహాయ కార్యదర్శి మహేశ్, మండల సహాయ కార్యదర్శులు రమేశ్, మధు, సీనియర్ నాయకులు ఎరుకులప్ప, డేనియేల్, కార్యవర్గ సభ్యులు నరసింహులు, షఫీ, మాబు, రాజు, మహబూబ్ బి పాల్గొన్నారు.

వైసీపీ కార్యాలయ నిర్మాణ పనులు అడ్డుకున్న గ్రామస్తులు

విశాలాంధ్ర-అనకాపల్లి: అనకాపల్లి జిల్లా రాజుపాలెం రెవెన్యూ పరిధి కొత్తూరు నర్సింగరావుపేటలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. గ్రామ అవసరాల కోసం కేటాయించిన స్థలంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయ నిర్మాణాన్ని గ్రామస్తులు అడ్డుకున్నారు. పోలీసు బందోబస్తు మధ్య ఆ స్థలంలో పనులు మొదలుపెడుతున్న విషయం తెలుసుకున్న మహిళలు, పురుషులు అక్కడకు చేరుకొని ఆందోళన చేశారు. గతంలో ఆ స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారు. గ్రామస్తుల ఆందోళనతో ఆక్రమణదారులు వెనక్కి తగ్గారు. వీఆర్వో నుండి కలెక్టర్ వరకు ఎవరూ కనీస నియమాలు, నిబంధనలు పాటించలేదని గ్రామస్తులు ఆరోపించారు. అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు బలగాలతో స్థలంలోనికి ప్రవేశించినా ప్రజలు తీవ్రంగా ప్రతిఘటించారు. మంత్రితో చర్చలు జరపాలని, అనంతరం తదుపరి కార్యాచరణ రూపొందించుకొని పోరాడతామని స్థానికులు చెప్పారు.

ప్రభుత్వ నిర్బంధాలను తిప్పికొడదాం

సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గఫూర్

విశాలాంధ్ర -భీమవరం: కార్మిక ఉద్యమాలపై నిర్బంధాలు ఎక్కువ య్యాయని, ఐక్య ఉద్యమాల ద్వారానే నిర్బంధాలను తిప్పికొట్టాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. సీఐటీయూ రాష్ట్ర మహాసభలలో భాగంగా రెండవ రోజు మంగళవారం ప్రతినిధులుసభ జరిగింది. సీఐ టీయూ నాయకులు సీహెచ్ నర్సింగరావు, వి.ఉమా మహేశ్వరరావు, జి.బేబీరాణి, పి.అజయ్‌కుమార్, కె.స్వరూపరాణి, కె.అజయ్ కుమార్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. గఫూర్ కార్యదర్శి నివేదిక ప్రవేశపెడతూ గత ప్రభుత్వం కార్మిక నాయకులను నిర్బందిస్తే ఈ ప్రభుత్వం అందరినీ గృహ నిర్బంధం చేస్తోందని విమర్శించారు. దశాబ్దాల కాలంగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న స్కీమ్ వర్కర్ల స్థానంలో జగన్ ప్రభుత్వం తమ కార్యకర్తలను నియమించేందుకు ప్రయత్ని స్తోందని విమర్శించారు. గతంలో ముఖ్యమంత్రి జిల్లాలకు వస్తే నాయకు లను మాత్రమే నిర్బంధించేవారని, ఇప్పుడు ప్రజాప్రతినిధులు ఎవరు వచ్చినా నాయకులు, కార్యకర్తలను సైతం నిర్బంధానికి గురిచేస్తున్నారని గఫూర్ విమర్శించారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు రక్షణ కరువైందన్నారు. ప్రయాణాల్లో వలస కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోయినా పరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. చిరు ఉద్యోగులపై వేధింపులు ఎక్కువయ్యాయన్నారు. వేతనాలు, ఉపాధి కోసం కార్మికులు ఆందోళన చేస్తుంటే యజమానులు (బౌన్సర్లు) గుండాలతో దాడులకు పాల్పడుతున్నారన్నారు. మహాసభల్లో విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ మూడేళ్లలో సీఐటీయూ కార్మికులు, కర్షకుల సమస్యలపై అలుపెరగనిపోరాటం చేసిందన్నారు.

జీవో నం.1 అప్రజాస్వామికం

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ప్రజా సమస్యలపై మాట్లాడే గొంతుకలను అణగదొక్కేందుకే రాష్ట్ర ప్రభుత్వం జీవో నం.1 జారీ చేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆరోపిం చారు. నిరంకుశ నిర్ణయాలతో పాలన కొనసాగిస్తున్న జగన్‌రెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, జీవో నం.1 చీకటి జీవోగా చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గతంలో ప్రభుత్వ వైఫల్యాలను పత్రికలు, మీడియా బయటపెడుతున్నాయనే కక్షతో జీవో నెం.2430 తెచ్చారు. ఇప్పుడు ఏకంగా ప్రతిపక్షాలు, ప్రజా సంఘాలు నోరెత్తకుండా చేయాలనే ఉద్దేశంతో జీవో నం.1 తెచ్చారు. ప్రజలు, పత్రికలు, ప్రతిపక్షాలు ప్రభు త్వాన్ని నిలదీయకూడదు, తప్పుల్ని ఎత్తి చూపకూడదనడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే. జగన్ రెడ్డి తన వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యా నికి తూట్లు పొడవడం దుర్మార్గం. ఉద్యమం అనే మాట ఎంతో పవిత్ర మైనది. ప్రభుత్వ అన్యాయాలను, అవినీతిని, ప్రజా సమస్యలను ఎండ గడుతూ ప్రజాస్వామ్యం ప్రజలకు కల్పించే హక్కుల సాధనకు ఆయుధంగా ఉన్న ఉద్యమాలను అణగదొక్కేందుకు ముఖ్యమంత్రి ప్రయత్నిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాలు అసలు సభలే పెట్టకూడదు, సమావేశాలు నిర్వహించకూడదనేలా రాష్ట్ర ప్రభుత్వం ఆంక్షలు విధించడం దుర్మార్గమన్నారు. రాజ్యాంగం కల్పించిన భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను కూడా హరించేలా జగన్ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతోందన్నారు. ప్రభుత్వ వేధింపులకు, ఆంక్షలకు భయపడేది లేదని, ప్రజా సమస్యలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

ఐక్యపోరుతోనే సత్ఫలితాలు

- సీపీఐ ప్రధాన కార్యదర్శి రాజా
- 'సంకెళ్లను తెంచుకుంటూ' పుస్తకావిష్కరణ

విశాలాంధ్ర-హైదరాబాద్:

మతోన్మాద, ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు అంబేద్కరిస్టులు, మార్క్సిస్టులు ముందుకు రావాలని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవడమే పెద్ద సవాలుగా మారిన నేపథ్యంలో "జైభీమ్ లాల్ నీల్" నినాదాలతో ఉపయోగం లేదని, అందరూ కలిసి పోరాటం చేసినప్పుడే సత్ఫలితాలు సాధ్యమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకి మాధవరావు రచించిన "సంకెళ్లను తెంచుకుంటూ" అనే ఆత్మకథ పుస్తకాన్ని లలిత రాజా ఫౌండేషన్, ప్రబుద్ధ భారత్ ఇంటర్ నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో సోమవారం నిర్వహించిన సభలో రాజా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి అధ్యక్షత వహించగా, పుస్తక రచయిత కాకి మాధవరావు "సంకెళ్లను తెంచుకుంటూ" తొలి కాపీని డాక్టర్ ఎన్. సిద్ధాజీరావుకు అందజేశారు. అనంతరం రాజా మాట్లాడుతూ కుల, వర్గ భూతాన్ని హతమార్చినప్పుడే సమాజంలో మార్పు, ఆర్థిక, రాజకీయ సంస్కరణలు సాధ్యమనే విషయాన్ని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారన్నారు. లౌకిక, ప్రజాస్వామ్య, రాజ్యాంగం పై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. ప్రస్తుతం ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించినా దేశద్రోహులుగా, నక్సలైట్లు, ఉగ్రవాదుల చిత్రీకరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పని చేస్తున్న దళిత అధికారుల పాత్ర, వారి పరిస్థితులు తెలుసునన్నారు. దేశంలో ఇప్పటికీ కుల, వర్గాల సమస్య ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. కాకిమాధవరావు బాల్యం, తల్లిదండ్రుల పాత్రను చదివితే, తనకు తన బాల్యం, తల్లి దండ్రుల పరిస్థితులు గుర్తుకొచ్చాయన్నారు. ఒక వ్యవసాయ కూలీ కుటుంబం నుంచే వచ్చానని, వీధి దీపాల కింద చదువుకున్నానని, తన కుటుంబంలో తానొక్కడినే గ్రాడ్యుయేషన్ చేశానని వివరించారు. తండ్రి ప్రభుత్వ ఉద్యోగం చేయాలని ఆకాంక్షిస్తే తాను మాత్రం కమ్యూనిస్టు మార్గాన్ని ఎంచుకున్నానని, 'నా తల్లి పూర్తి స్వేచ్ఛనిస్తూ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. మన జీవితంలో తల్లే పెద్ద మహాత్మా అని అన్నారు. ప్రతి మనిషికి విద్య అనేదే పెద్ద ఆయుధమని, ఆ విద్యను అభ్యసించినప్పుడే వ్యక్తులు ఉన్నత స్థానంలో నిలబడుతారన్నారు. దళిత మహిళల దారుణమైన వివక్షత ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "సంకెళ్లను తెంచుకుంటూ" జీవిత చరిత్ర కేవలం కాకి మాధవరావుకు చెందిందే కాదని, ఇదొక దళిత, యువజనులకు చెందిన చరిత్ర అని రాజా చెప్పారు. రచయిత వోల్గా మాట్లాడుతూ ఆత్మచరిత్రలో కల్పనకు తావు ఉండకూడదని, "సంకెళ్లను తెంచుకుంటూ జీవిత చరిత్రలో కూడా కల్పనకు తావు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ హరగోపాల్ పాల్గొన్నారు.

త్వరలో కారుణ్య నియామకాలు

ఈయూ నేతలకు ఆర్టీసీ ఎండీ హామీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆర్టీసీ విలీనానికి ముందు- తర్వాత జరగాల్సిన కారుణ్య నియామకాలను ప్రభుత్వ ఆదేశాలతో త్వరలోనే పూర్తిచేస్తామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు అన్నారు. కొన్నిజిల్లాల కలెక్టర్ల చొరవతో వివిధ ప్రభుత్వశాఖలలో 280 మందికి ఉద్యోగాలిచ్చినట్లు తెలిపారు. ఈయూ రాష్ట్ర అధ్యక్షులు వైవీ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదరరావు, ఉప ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మంగళవారం తిరుమలరావును కలిసి వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈయూ నేతలతో తిరుమలరావు మాట్లాడుతూ కారుణ్య నియామకాల్లో మిగిలినవి అభ్యర్థుల అర్హతలుబట్టి ఆర్టీసీలో కండక్టర్, డ్రైవర్, శ్రామిక్, జూనియర్ అసిస్టెంట్లు, సెక్యూరిటీ కానిస్టేబుళ్లుగా నియమిస్తామన్నారు. రెండు, మూడునెలల్లో ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని చెప్పారు. కొత్త పీఆర్సీ ఆధారంగా ఉద్యోగుల ప్రయోజనాలు, వారికి బకాయిల చెల్లింపులు జరుగుతాయన్నారు.

స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి

మంత్రి అమర్నాథ్‌కు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నేతల వినతి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని విక్రయించేందుకు కేంద్రం పావులు కదుపుతోందని, కర్మాగారాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ అన్నారు. ఉక్కు కర్మాగార ప్రైవేటీకరణను అడ్డుకోవాలని పోరాట కమిటీ చైర్మన్ల నేతృత్వంలోని కమిటీ సభ్యులు మంగళవారం మిందిలోని రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్నాథ్ క్యాంపు కార్యాలయంలో ఆయనను కలుసుకొని వినతి పత్రం సమర్పించారు. ఉక్కు కర్మాగారం సాధనకు 32 మంది ప్రాణ త్యాగం చేశారని, 52 మంది శాసనసభ్యులు, ఏడుగురు పార్లమెంటు సభ్యులు తమ సభ్యత్వాలకు రాజీనామాలు చేసి పోరాటంలో పాల్గొన్నారని ఆదినారాయణ మంత్రికి వివరించారు. 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నడుస్తూ లాభాలను ఆర్జిస్తున్న ఈ కర్మాగారాన్ని ప్రైవేటీకరించడం తగదని అన్నారు. ఇప్పటికే దీనిపై రాష్ట్ర ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, కార్మిక సంఘాలు 682 రోజులుగా ఉద్యమం చేస్తున్నారని, లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ పార్లమెంటులో తమ గళాన్ని వినిపించినా, ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాలేదని తెలిపారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణపై కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో నిర్ణయం తీసుకోనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రైవేటీకరణను నిలిపివేసేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కమిటీ నేతలు కోరారు. దీనిపై మంత్రి అమర్నాథ్ స్పందిస్తూ, ఈ విషయాన్ని తాను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. మంత్రి అమర్నాథ్‌ని కలిసిన వారిలో వైటీ దాసు, వై.మస్తానప్ప ఎస్.రామచంద్రరావు, రామకృష్ణ, వి.రామ్మోహనరావు, బి.పైడిరాజు, డి.నాయుడు, మంగ వెంకట్రావు, ఎం.పరదేశి, పిట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ జీవో వెనక్కి

రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఒకట్రెండు ఘటనల ఆధారంగా ర్యాలీలు, సభల్ని నిషేధిస్తూ జీవోను జారీచేయడం తగదని, దీనిని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ పార్టీల సభల్లో అలాంటి దుర్ఘటనలు జరగకుండా నిర్వాహకులు, పోలీసు యంత్రాంగం అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వివిధ పట్టణాల్లో కార్పొరేషన్, మున్సిపల్ ప్రాంతాల్లో ఇలాంటి ఆందోళనలు జరుగుతాయన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లి కలెక్టర్లు, ఎస్పీల అనుమతులు పొందాలంటే అసాధ్యమన్నారు. సాధారణ నిరసనలకు ఇప్పుడు అమలులో ఉన్న పోలీసు యాక్ట్ వల్ల అనుమతులు ఇవ్వడం లేదన్నారు. ఎంపిక చేసిన ప్రదేశాలు అత్యంత అరుదైన సందర్భాలలోనే అనుమతివ్వాలన్న నిబంధనలు అధికార పార్టీకే వర్తిస్తుందా? ప్రతిపక్షాలకుగానీ, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకుగానీ వర్తించవా? అని ప్రశ్నించారు. వెంటనే ఈ నిషేధం జీవోను రద్దు చేయాలని రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు.

ఆ నిషేధం అన్ని పార్టీలకూ వర్తింపు: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో బహిరంగ సభలు, ర్యాలీలపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం నిషేధం విధించింది. అధికార వైసీపీతో పాటు అన్ని రాజకీయ పార్టీలకు ఈ నిషేధం వర్తిస్తుందని రాష్ట్రప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తెలిపారు. 'రోడ్లపై సభలు, ర్యాలీలు నిషేధించాం.. సభలను మైదానాల్లో ఏర్పాటు చేసుకోవచ్చు.. ఈ నిషేధం అధికార-విపక్షాలన్నింటికీ వర్తిస్తుంది. వైసీపీ కూడా నిబంధనలకు కట్టుబడాల్సిందే. టీడీపీ సభల్లో అపశృతుల కారణంగా నిషేధాజ్ఞలు జారీ చేయాల్సి వచ్చింది' అని ఆయన అన్నారు. నిషేధం విధించిన ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తే తదుపరి పరిణామాలకు వారే బాధ్యులవుతారని సజ్జల రామకృష్ణారెడ్డి స్పష్టంచేశారు. గుంటూరు సభ నిర్వహణలో టీడీపీ బాధ్యతారహితంగా వ్యవహరించిందని, అందుకే ప్రమాదం జరిగిందన్నారు. తమ తప్పులు కప్పిపుచ్చుకుంటూ సామాజిక మాధ్యమాల్లో వైసీపీని తిట్టడమే టీడీపీ పనిగా పెట్టుకున్నదని మండిపడ్డారు. చట్టానికి అతీతులమన్నట్లుగా ఆ పార్టీ వైఖరి ఉందని విమర్శించారు. వ్యవస్థ, పోలీసులు పనిచేయకూడదనీ, కోర్టులు వారికి అనుకూలంగా ఉండాలనేదే టీడీపీ ధోరణి అని అన్నారు. చంద్రబాబు అధికారంలోకి రావాలనీ, జగన్ దిగిపోవాలనేదే వారి లక్ష్యంగా ఉన్నారన్నారు. లోకేశ్ పాదయాత్రకుగానీ, చంద్రబాబు యాత్రకుగానీ, పవన్ కల్యాణ్ బస్సు యాత్రలకుగానీ అభ్యంతరం తెలుపడం లేదని చెప్పారు.

తమ సభల నిర్వహణకు మైదానాలు ఎంపిక చేసుకోవాలని పార్టీలకు సూచిస్తున్నామే తప్ప సమావేశాలపై ఆంక్షలు విధించలేదన్నారు. గుంటూరు సభలో తొక్కిసలాట మృతులపై చంద్రబాబుకు సానుభూతి లేదన్నారు. సభ జరిగిన చోట దృశ్యాల్ని చూస్తే పోలీసులు తప్ప ఎవరూ సహాయం చేస్తున్నట్లు కనిపించలేదన్నారు. ఏపీలో చాలా మంది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లో చేరబోతున్నారన్న ప్రశ్నకు... ఎవరు, టీడీపీలోని 23 మంది ఎమ్మెల్యేలా? అని సజ్జల ఎదురు ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయరాదన్నదే తమ అభిమతమని, ఇతర పార్టీలూ దీనికి మద్దతు పలికితే అది మంచి పరిణామమేనని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు.

ప్రకటన

రైతులకు మరియు వ్యవసాయ శాఖా వారికి Cropvin Agri Pvt. Ltd., వారు దిగువ తెలిపిన **100%** నీటిలో కరిగే మిశ్రమ న.భా.పో. ఎరువులు దిగుమతి చేసుకొని అమ్మబడును. కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ గెజిట్ ఆర్డర్ నెం. **2900 (E)** తేదీ **24 అక్టోబర్ 2015** నిబంధనలకు లోబడి త్వరలో అమ్మకము చేయదలచుకున్నామని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము.

13:40:13	13:05:26
19:11:11	16:08:24
24:24:00	23:00:23
20:20:20	16:44:00
14:35:14	10:26:26
12:44:00	18:46:00
19:19:19	0:40:40+6% ZN
11:11:08-ZN+B	Potassium Schoenite (KMS)
06:00:18+Ca+Mg+B	

మరిన్ని వివరాలు కోరకు ఫోన్ నెం. +914042008509.Email : info@ cropvinagri.com

సంపాదకీయం

కాంగ్రెస్ ఆధిపత్య ధోరణి

చింత చచ్చినా పులుపు చావలేదని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ నిరూపిస్తున్నారు. గత సెప్టెంబర్ ఏడో తేదీన కన్యాకుమారి నుంచి ప్రారంభమైన భారత్ జోడో యాత్ర దిల్లీలో తొమ్మిది రోజుల విరామం తరవాత మంగళవారం ఉత్తరప్రదేశ్‌లో ప్రవేశించింది. 3500 కిలోమీటర్లు సాగవలసిన ఈ యాత్ర మరో నెలరోజులపాటు సాగవచ్చు. దక్షిణాదిలో, మహారాష్ట్రలో రాహుల్ భారత్ జోడోయాత్రకు ఊహించిన దానికన్నా ఎక్కువ స్పందనే కనిపించడంతో ఇక తమకు ఎదురులేదని కాంగ్రెస్ నాయకులు భావిస్తున్నట్టున్నారు. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ అయితే 2024 సార్వత్రిక ఎన్నికలలో ప్రతిపక్షాలు విజయం సాధిస్తే రాహుల్‌గాంధీయే ప్రతిపక్షాల తరపున ప్రధాన మంత్రి అభ్యర్థి అని ఏకపక్షంగా ప్రకటించేశారు. భారత్ జోడో యాత్రవల్ల కాంగ్రెస్‌లో కొత్త ఆశలు అంకురిస్తున్న విషయం నిజమే కావచ్చు. రాహుల్ గాంధీ వ్యవహార సరళిలో మార్పుతీసుకురావడానికి కూడా ఈ యాత్ర తోడ్పడి ఉండవచ్చు. కునారిల్లిపోయిన కాంగ్రెస్ జవజీవాలు సంతరించుకుంటే ఎవరూ అభ్యంతర పెట్టవలసిన పనిలేదు. కానీ ఇదంతా తమ ఘనతేనన్నట్టు కొంతమంది కాంగ్రెస్ నాయకులు అత్యాశో, అత్యుత్సాహమో ప్రదర్శిస్తున్నారు. కన్యాకుమారిలో రాహుల్ ఈ యాత్ర ప్రారంభించినప్పుడు దాదాపు ఒంటరే. యోగేంద్ర యాదవ్ లాంటి కొద్దిమంది సామాజిక కార్యకర్తలు, యాత్ర పొడవునా భాగస్వాములవుతున్న కాంగ్రెస్ కార్యకర్తలు మాత్రమే ఆయనతోపాటు యాత్ర ప్రారంభించారు. అయితే దారిపొడవునా అనేకమంది ప్రముఖులు ఈ యాత్రలో భాగస్వాములైనందువల్ల ఈ యాత్రకు విశ్వసనీయత సమకూరింది. తమిళనాడు, మహారాష్ట్రలో కాంగ్రెస్‌తో మైత్రిఉన్న రాజకీయపార్టీల నాయకులు రాహుల్‌తోకలిసి అడుగువేయడం కూడా కలిసొచ్చింది. ప్రస్తుతం ఈ యాత్ర కాంగ్రెస్‌కు, దాని మిత్రపక్షాలకు బొత్తిగా బలంలేని ప్రాంతాలద్వారా సాగవలసి ఉంది. అంటే ఇప్పుడు కొనసాగబోయే యాత్రలో యు.పి.ఎ. భాగస్వామ్య పక్షాలకు ఉన్నపట్టు చాలా స్వల్పం. ఈ ప్రాంతాలలో ముఖ్యంగా ఉత్తరప్రదేశ్‌లో ప్రతిపక్షంలో భాగమైన అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని సమాజ్ వాదీపార్టీ, మాయావతి నేతృత్వంలోని బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ), జయంత్ చౌదరి నాయకత్వంలోని రాష్ట్రీయ లోక్‌దళ్‌కు చెప్పుకోదగ్గ బలమే ఉంది. ఇంకా అధికారంలో ఉన్న మమతా బెనర్జీ నాయకత్వంలోని తృణమూల్ కాంగ్రెస్‌కు ప్రాబల్యంఉన్న బెంగాల్‌ద్వారా ఈ యాత్ర సాగవలసి ఉంది. ఈ విభిన్న రాజకీయపక్షాల మద్దతు సమకూరాలని రాహుల్‌గాంధీ కోరుకోవడంలో తప్పు లేదు. అందుకే ఆయన వివిధ ప్రతిపక్షాల నాయకులకు యాత్రలో కలిసి అడుగువేయాలని కోరుతూ లేఖలు రాశారు. కానీ ఏ రాజకీయపార్టీ ఈ ఆహ్వానాన్ని మన్నించిన దాఖలాలు లేవు. ఇది రాజకీయయాత్ర కాదని, దేశాన్ని సమైక్యం చేయడానికి ఉద్దేశించిందేనని కాంగ్రెస్ ఎంతగా వాదించినా ఈ యాత్ర వెనకాల ఉన్న లక్ష్యాల మర్మం గ్రహించనివారు ఎవరూలేరు. రాజకీయ పార్టీలకు మాత్రమే కాకుండా అనేక సాహిత్య, సాంస్కృతిక సంస్థలకు కూడా రాహుల్ శిబిరం నుంచి ఆహ్వానాలు వెళ్లాయి. అయితే స్పందన అంత ఉత్సాహకరంగా లేకపోవడానికి ఈ యాత్రలో ఇమిడిఉన్న రాజకీయ లక్ష్యమే ప్రధాన కారణం. ఒక్క కశ్మీర్‌లో మాత్రం మెహబూబా ముఫ్తీ నాయకత్వంలోని పీపుల్స్ డెమొక్రాటిక్ పార్టీ(పి.డి.పి.), ఫరూఖ్ అబ్దుల్లా నాయకత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం కొంత సానుకూలత వ్యక్తం చేసినట్టు కనిపిస్తోంది.

తమిళనాడులో డి.ఎం.కె., మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే నాయకత్వంలోని శివసేనవర్గం, పవార్ నాయకత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్.సి.పి.) లాగా పి.డి.పి, నేషనల్ కాన్ఫరెన్స్ ప్రస్తుతం కాంగ్రెస్‌కు మిత్రపక్షాలేమీ కావు. యు.పి.ఎ.లో భాగస్వామ్య పక్షాలు తప్ప మిగతా పార్టీలు రాహుల్ యాత్రకు మద్దతు ఇవ్వడానికి సుముఖంగా లేవు. బుధవారం బెంగాల్‌లో రాహుల్‌యాత్ర ప్రవేశించినా మమతా బెనర్జీ బాహాటంగా స్వాగతంచెప్పే అవకాశాలు ఏమీలేవు. తమిళనాడులో ఈ యాత్ర సాగినప్పుడు కనిపించని మక్కల్ నీధి మయ్యం నాయకుడు, ప్రసిద్ధ సినిమా నటుడు కమల్‌హాసన్ మాత్రం దిల్లీలో రాహుల్‌కు మద్దతు పలికారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు నామ మాత్రమైన బలంకూడా లేదని సమాజ్‌వాదీ పార్టీ నాయకులు ఎద్దేవా చేస్తున్నారు. భారత్ జోడో యాత్రలో పాల్గొనాలని ఆహ్వానాలు పంపిన కాంగ్రెసే అనేక ప్రతిపక్షాలనుంచి ఆశించిన స్పందన రానందువల్ల ఇష్టం ఉన్న వారు పాల్గొనవచ్చు లేకపోతే లేదు అని మునుపటి అహంకార పూరిత ధోరణినే ప్రదర్శించడం ఆశ్చర్యంగాఉంది. ఇది ప్రతిపక్షాల యాత్ర కాదని కూడా అంటున్నారు. ఈ యాత్ర జాతీయ సమైక్యత కోసమని, ఆర్థిక వ్యవస్థకు సంబంధించిందని కాంగ్రెస్ నాయకులు వాదిస్తున్నారు. కాంగ్రెస్ గంగానది లాంటిదని వచ్చేవారు వస్తారు, రాని వారు రారని బింకం ప్రదర్శిస్తున్నారు. నిజమే కావచ్చు. కానీ ఇంతవరకు భారత్ జోడో యాత్రకు సమకూరిన మద్దతు కాంగ్రెస్‌లో సంతృప్తి కలిగిస్తే అభ్యంతర పెట్టవలసింది ఏమీలేదు. అది మోదీ పరిపాలనపై పేరుకుపోయిన విముఖతవల్లే అని గుర్తుంచుకోవాలి. కానీ కాంగ్రెస్‌లో అపరిమితమైన ఆత్మవిశ్వాసం కనిపిస్తోంది. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికలలో ప్రతిపక్షాలు సమన్వయంతో పనిచేయాలని రాహుల్ స్వయంగా గత శనివారం అన్నారు. బీజేపీని ఓడించాలన్న అభిప్రాయం ప్రతిపక్ష పార్టీలన్నింటికీ ఉండొచ్చు. అధికారంమీద ఆశవల్ల ఆ భావన కాంగ్రెస్‌లో మరింత ఎక్కువగా ఉండొచ్చు. కానీ చాలారోజుల నుంచి మోదీ వినాశకరమైన పాలనను అంతం చేయడానికి ప్రతిపక్షాలన్నీ ఏకం కావలసిన అవసరం ఉందని మమతా బెనర్జీ, నితీశ్ కుమార్ తదితరులు చెప్తున్నా కాంగ్రెస్ స్పందించనే లేదు. కాంగ్రెస్ లేకుండా ప్రతిపక్షాల ఐక్యత సంపూర్ణమూ కాదు, ఫలితమూ లేదు అని ప్రతిపక్షాల నాయకులు వాదిస్తున్న దశలో కాంగ్రెస్ నుంచి ఎలాంటి సానుకూలతా కనిపించడం లేదు. భారత్ జోడో యాత్రకు లభిస్తున్న మద్దతుకారణంగా కాంగ్రెస్‌లో ఆశలు చిగురిస్తే తప్పు పట్టవలసిన పనిలేదు కాని ఆధిపత్య ధోరణి మోదీకే ఉపకరిస్తుంది. ఎలాంటి పనులు చేయకూడదో బీజేపీని చూసి నేర్చుకున్నానంటున్న రాహుల్ ప్రతిపక్ష ఐక్యతకు మొన్నటిదాకా ఎందుకు చొరవ తీసుకోలేదో సమాధానం చెప్పాలిగా! కాంగ్రెస్ అతి పెద్ద ప్రతిపక్ష పార్టీ కనక మోదీని ఓడించాలన్న చిత్త శుద్ధి ఉంటే ప్రతిపక్ష ఐక్యతకు ఏ ప్రయత్నమూ చేయకుండా కాస్తంత మద్దతు సమకూరినట్టు కనిపించగానే అగ్రస్థానం తమదేనంటే అర్థం ఏమిటి?

ధర్మాన అధర్మ ప్రవచనం



వి. శంకరయ్య

పోలవరం ప్రాజెక్టు 45.72(150 అడుగులు) మీటర్ల ఎత్తు నిర్మాణం జరిగి, ఎడమ కాలువ పనులు పూర్తయితే గాని ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు, ముప్పయి లక్షల మందికి తాగునీరు అందించే ఉత్తరాంధ్ర సుజల స్రవంతి అమలుకు రాదనే స్పృహ రాష్ట్రమంత్రి ధర్మాన ప్రసాదరావుకు తట్టక పోవడం యాదృచ్ఛిక మేమీకాదు. తర తరాలుగా నీటికోసం తపిస్తున్న లక్షలాది మంది ఉత్తరాంధ్ర జిల్లాల రైతుల జీవన ప్రమాణాలు కుదటపడటం గుర్తుకురాలేదని భావించలేం. ఆయన ఇప్పుడే కాదు, గతంలో కూడా రెవెన్యూ శాఖమంత్రిగా పనిచేశారు. గాని తాజాగా విశాఖపట్నం పరిపాలన రాజధాని కాకపోతే మంత్రి పదవిని వదులు కొంటానని, ప్రత్యేక రాష్ట్రం కావాలని కోరడంతో ఆయన ఆంతర్యం అంచనా కట్టడానికి షరాబు అక్కరలేదు. మూడు జిల్లాల ప్రజలకు బాగా తెలుసు. మంత్రి ధర్మాన ప్రసాదరావు స్వస్థలమైన ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సగటు వర్షపాతం 1400 మిల్లీ మీటర్లు. అనంతపురం జిల్లా సగటు వర్షపాతం 500 మిల్లీమీటర్లు. అయితే అనంతపురం జిల్లాతో ఇంచుమించు ఒకేలా వుంది.

బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే శ్రీకాకుళం జిల్లా ప్రజల గుండెల్లో రైళ్లు పరుగెడతాయి. తుఫాన్లు వెలిసిన తర్వాత వరదనీరు సముద్రం పాలవుతుంది. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్లు గడుస్తున్నా, ఏ పార్టీ అధికారంలో వున్నా శ్రీకాకుళం జిల్లా రైతుల గురించి పట్టించుకొన్న నాథుడులేడు. వంశధార, నాగావళి నదుల అనుసంధానం కాగితాలకే పరిమితమైంది. అధికారిక లెక్కల ప్రకారం, ఏటా వంశధార నుంచి ఇంచుమించు 50 టియంసిల నీరు సముద్రం పాలవుతోంది. వంశధారపై నేరెడి వద్ద బ్యారేజీ నిర్మాణానికి 2021 లోనే ట్రిబ్యునల్ అనుమతి ఇచ్చింది. ఒడిశా సుప్రీంకోర్టు కెక్కినా దానితో చర్చలు సమగ్రంగా జరగలేదు. ఇందులో మంత్రి ధర్మాన ప్రసాదరావు కృషి శూన్యం. హీరమండలం రిజర్వాయర్ 19.65 టీయంసిల సామర్థ్యంతో నిర్మాణం జరిగినా నీళ్లు నింపడం లేదు. నిన్న మొన్నటి వరకు చెన్నై, బెంగళూరు నగరాల్లో నిర్మాణంలో వున్న భవనాలు కూలిపోతే వాటి కిందపడి చనిపోయేవారు శ్రీకాకుళం జిల్లా వాసులుగా వుండేవారు. ఇటీవల అరేబియా సముద్రంలో చేపలవేటలో పడవ బోల్తాపడితే మృతి చెందినవారు ఈ జిల్లా వాసులుగా అందరికి తెలుసు. తనకు రాజకీయ జన్మఇచ్చిన ఉమ్మడి శ్రీకాకుళంజిల్లా ప్రజల జీవనప్రమాణాలు మెరుగుదలకు అవసరమైతే మంత్రి పదవి వదులుకోవాలనే ఆలోచన ధర్మాన ప్రసాదరావుకు తట్టలేదు. ఆఖరుగా ఒకవేళ విశాఖ పరిపాలన రాజధాని అయితే, జనాభా పెరిగితే పోలవరం నుండి కేటాయించిన 23.99 టియంసిల నీళ్లే గతి. కాని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కలసి కుట్రపూరితంగా పోలవరం ప్రాజెక్టు ఎత్తు 41.15(135 అడుగులు) మీటర్లకే పరిస్థితి చేయబోతున్నారు. అదే జరిగితే రాజధానికి తాగునీళ్లు ఎక్కడనుంచి తెస్తారు?

విశాఖ పరిపాలన రాజధాని అయితే, ఉత్తరాంధ్రకు చెందిన లక్షలాది మంది సామాన్య ప్రజలకు ఒరిగేమేలు ఏ మేరకు వుంటుందో పక్కన పెడితే, తక్షణమే ఒనకూడే రియల్ ఎస్టేట్ లాభాలు మాత్రమే మంత్రి బుర్రను తొలుస్తున్నందున ప్రత్యేక రాష్ట్రం, మంత్రి పదవికి రాజీనామా అస్త్రం తెర మీదకు తెచ్చారని భావించడం తప్పుకాదేమో. గత ప్రభుత్వ హయాంలోగాని, ఈ మూడేళ్లకాలంలో గాని ధర్మాన ప్రసాదరావుకు ఇవేవీ ఎందుకు తట్టలేదో ఆయన నోట నుండే వస్తే బాగుంటుంది.

గతంలో ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు అని ఎక్కడో మారుమూల వున్న అనంతపురం జిల్లా వాసులు కూడా బలిదానం చేశారు. గత మూడేళ్లుగా విశాఖ ఉక్కుకర్మాగారం ప్రైవేటు పరంకాకుండా ఉత్తరాంధ్ర ప్రాంత ఉద్ధారకుడుగా మంత్రి ధర్మాన ప్రసాదరావు చేసిన కృషి శూన్యం. రాష్ట్ర విభజనచట్టం సెక్షన్ 93 షెడ్యూల్ 13 మేరకు అవశేష ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోలియం యూనివర్సిటీ నెలకొల్పాలి. విశాఖలో నెలకొల్పవలసిన పెట్రోలియం యూనివర్సిటీ ఇతర రాష్ట్రానికి తరలి పోతే నిజంగా ఉత్తరాంధ్ర అభివృద్ధిని మంత్రి కాంక్షించి వుంటే చేసిన కృషి ఏమిటో చెబితే బాగుంటుంది. ఉత్తరాంధ్రలోని మూడుజిల్లాల అభివృద్ధికి ఉపకరించే ఏ ఒక్క అంశంలోనూ ఇప్పటి వరకు నోరు విప్పని మంత్రి ధర్మాన ప్రసాదరావుకు ఇప్పుడే ప్రత్యేక రాష్ట్ర నినాదం, మంత్రి పదవిని త్యజించే ఆలోచన ఎందుకు తట్టిందో నిగ్గు తేల్చేందు పీహెచ్‌డీ చేసే పరిశోధక విద్యార్థి అవసరం లేదు.

సెల్: 9848394013

సావిత్రీబాయి, ఫాతిమా ఎనలేని సేవలు

ఫాతిమా, సావిత్రీబాయి

విద్య ద్వారా సమాజంలోని అసమానతలను రూపుమాపాలని, మహిళా సాధికారత కోసం, మహిళలకు విద్యావకాశాల పెంపుదల కోసం ఉద్యమించిన వారిలో ముందు తరం నాయకురాళ్లు సావిత్రీబాయి పూలే, ఫాతిమాషేక్‌లు. సామాజిక, రాజకీయ అభ్యున్నతికి దారితీసే విధంగా స్త్రీలకు విద్యా నమూనాను రూపొందించడంలో కృషి చేసిన అట్టడుగు వర్గాలకు చెందిన సావిత్రిబాయి పూలే, ఫాతిమాషేక్‌ల 192 వ జయంతి ఉత్సవాల సందర్భంగా జాతీయ విద్యా విధానాన్ని నిరసిస్తూ జనవరి 3 వ తేదీనుంచి 9 వ తేదీ వరకు ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు దేశవ్యాప్తంగా పిలుపు నిచ్చింది. జనవరి 3 వ తేదీ సావిత్రిబాయి పూలే జయంతికాగా, 9 వ తేదీన ఫాతిమా షేక్ జయంతి. 18 వ దశకంలో స్త్రీలకు ఎటువంటి విద్యను అనుమతించకపోవడమే కాకుండా చిన్నతనంలోనే వివాహాలు చేయడం, సతీసహగమనం వంటి సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు విశేష కృషిచేసిన సావిత్రీబాయి పూలే భర్త జ్యోతిబా పూలే సహకారంతో సమాజంలో స్త్రీల విద్యకు అంకురార్పణ చేశారు. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, ప్రముఖ సంఘసేవకులు సావిత్రిబాయి పూలే, ఫాతిమాషేక్‌లు అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలకు ముఖ్యంగా బాలికలకు విద్యావకాశాలు కల్పించడంలో దేశంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. కులం, మతంతో సంబంధం లేకుండా మహిళలకు విద్యను అందించడంలో భారతదేశంలో సమగ్ర విద్యకు పునాది వేసారు. ఫాతిమాషేక్ తన ఇంటిలోనే బాలికలకోసం మొదటి పాఠశాలను నిర్మించి 1848 లో బాలికలు, పేదలు, అట్టడుగు వర్గాల బాలబాలికలకు సమగ్ర విద్యా వ్యవసను ఏర్పాటు చేయడంలో జ్యోతిరావు, సావిత్రిబాయిలకు సహాయపడిన సహోద్యోగి. ఇంటి ఇంటికి తిరిగి బాలికల పేర్లు నమోదు చేసుకుని వారిని చదివించడంలో ఈ మహిళలు చరిత్ర సృష్టించారు.

పితృస్వామ్యవ్యవస్థ, కుల, వర్గ, లింగ విచక్షణలకు వ్యతిరేకంగా పోరాడి మహిళల్లో విద్యా చైతన్యం కలిగించారు సావిత్రీబాయి పూలే, ఫాతిమాషేక్‌లు. సమాజంలో స్త్రీ అణచివేతలకు వ్యతిరేకంగా పోరాడేందుకు విద్యను ఆయుధంగా ఉపయోగించారు. బడుగు, బలహీన వర్గాలు, మహిళల సమాన హక్కుల కోసం తాము ఎంచుకున్న మార్గంలో ఎన్ని అవమానాలు ఎదురైనా ప్రతిఘటిస్తూ, వివక్షతకు వ్యతిరేకంగా పోరాడేందుకు తమ తమ సంఘాలతో కలిసి పోరాడారు. టుబోనిక్ ప్లేగు వ్యాప్తి సమయంలో సావిత్రీబాయి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యం అందించడానికి దళిత సంఘాలతో అవిశ్రాంతంగా పనిచేసారు. ఆ ప్రక్రియలో ఆమెకు క్షయ వ్యాధి సోకింది. సావిత్రీబాయి పూలే, జ్యోతిరావు, ఫాతిమాషేక్‌లతో కలిసి సంఘ సంస్కర్తలుగా, ఉద్యమకారులుగా పనిచేసి సజీవ వారసత్వాన్ని సృష్టించారు. మహాత్మా జ్యోతిరావుపూలే 1882 లో ఇండియన్ ఎడ్యుకేషనల్ కమీషన్ (హంటర్ కమిషన్) కి సమర్పించిన మెమోరాండంలో బ్రిటీష్ వారిని తీవ్రంగా విమర్శించారు.

2020 నుంచి ప్రస్తుతం ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన విద్యావిధానం 'ఎన్‌ఈపీ' ఇద్దరూ కలిసి పనిచేసిన అన్ని సామాజిక సాధికారతలను తిప్పికొట్టే ప్రయత్నం చేస్తోంది. సమాజంలోని అన్నివర్గాలను కలుపుకుని ఉండగా, ఎన్‌ఈపీ ఇప్పటికే అట్టడుగున ఉన్నవారిని మినహాయించేలాగా తయారు చేశారు. సైన్స్, మానవహక్కులు, లింగ హక్కులను బహిరంగంగా దూషించి, సామాజిక విభజనలను ప్రోత్సహించిన రచనలను ప్రచారం చేయడానికి ఎన్‌ఈపీ విద్యా వేదికను ఉపయోగించుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతి విద్యార్థులకు సంబంధించి వారి ఆర్థికనిర్వహణ గురించి ప్రభుత్వఆడిట్ ఉండదు. ప్రైవేట్- దాతృత్వ సంస్థల సద్భావన ఉంటుంది. విద్య ద్వారా సామాజిక వివక్షలను ఎలా ఎదుర్కోవాలనే పోరాట పటిమను ఈ విద్యావిధానం కల్పించడం లేదు.

అధ్యాపకులుగా తల్లుల పాత్రను మూస పద్ధతిలో రూపొందించడం నుంచి, విద్య బాధ్యతను (పోషకాహారాన్ని అందించడం నుంచి విద్యను అభ్యసించడంలో సహాయ చేయడం) తల్లిపై ఉంటుంది. అట్టడుగువర్గాల విద్యను పరోపకారి చేతుల్లోకి వదిలేయడంతో దేశంలో అతి పెద్దపరోపకారి పితృస్వామ్య విధానాన్ని బోధించే, ఆచరించే, ప్రచారంచేసే మతపరమైన సంస్థలు అనే వాస్తవాన్ని ఇది ఉద్దేశపూర్వకంగా కప్పివేస్తుంది. ఈ విధానం ద్వారా మైనారిటీ సంస్థలకు వనరులను తగ్గించడం ద్వారా ముందుకు సాగించవచ్చు. మహిళలకు సంబంధించి ఎన్‌ఈపీ అత్యంత హానికరమైన అంశం.

వైద్య, న్యాయ విద్యకోసం ఇచ్చిన మార్గదర్శకాల నుంచి ఇది సాంప్రదాయ వైద్యంతో శాస్త్రీయ వైద్యాన్ని భర్తీ చేయడానికి ప్రయత్నిస్తున్న లోపభూయిష్ట చర్యగా చెప్పుకోవచ్చు. చట్టపరమైన రంగంలో ఇది స్థానిక సంస్కృతులలో పాతుకుపోయిన న్యాయవ్యవస్థలతో రాజ్యాంగాన్ని భర్తీచేయడానికి ప్రయత్నిస్తున్నది. భారతీయ ప్రజాస్వామ్య పునాది విలువలను అభ్యాసకులు ప్రసారం చేయడం న్యాయ విద్య విధి. అలా చేయడం ద్వారా, చట్ట పాఠ్యాంశాలు, ప్రజల సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర, భారతీయ సాహిత్యం, పురాణాలలో పొందుపరచిన అధర్మం, ధర్మంపై ఏకాభిప్రాయాన్ని పెంతుంది. విశ్వవిద్యాలయాలలో సంబంధిత అధికారులు పాఠ్యాంశాలు, సాక్ష్యం ఆధారిత పద్ధతిలో న్యాయపరమైన ఆలోచన చరిత్ర, న్యాయసూత్రాలు, న్యాయశాస్త్ర, ఇంతర అశాలను ప్రతిబింబించేలా చూడాలి. సావిత్రిబాయి-ఫాతిమాల జన్మదిన వార్షికోత్సవాల సందర్భంగా ఎన్‌ఎఫ్ఐడబ్ల్యు విద్యను దేశంలో ఒక ఆయుధంగా చాటి చెప్పాలని డిమాండ్ చేసింది. అట్టడుగు వర్గాల మహిళల సాధికారత కోసం, అణచివేతలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చింది.

అనీరాజా
భారత జాతీయ మహిళాసమాఖ్య ప్రధానకార్యదర్శి

ప్రచార ఆర్భాటంలో తృణధాన్యాలు

ప్రపంచవ్యాప్తంగా 70 కంటే ఎక్కువ దేశాల మద్దతుతో ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీ 2023 సంవత్సరాన్ని 'అంతర్జాతీయ మిల్లెట్స్(తృణధాన్యాల) సంవత్సరంగా ప్రకటించడానికి ప్రధానమంత్రి దార్శనికత చొరవ దారితీసిందని జబ్బలు చరుచుకుంటున్నారు. సుస్థిర వ్యవసాయంలో మిల్లెట్లది ముఖ్యమైన పాత్ర. అంతర్జాతీయ మిల్లెట్ల సంవత్సరం 2023ని ప్రారంభించేందుకు ఐక్యరాజ్యసమితిలో ఆహార, వ్యవసాయ సంస్థకు కేంద్ర ప్రభుత్వం కృతజ్ఞతలు తెలిపింది. మిల్లెట్‌లు మానవులు పండించే తొలి పంటలలో ఒకటి, పోషకాల ముఖ్యమైన మూలం అని దీనిని ఆహార ఎంపికగా మార్చాలని ప్రధాని నొక్కి చెప్పారు. వాతావరణ మార్పు ఆహార లభ్యతను ఎలాప్రభావితం చేస్తుందో ఆయన స్పృశించారు. ఆహార భద్రత దిశలో ఒక ముఖ్యమైన ముందడుగు అని గుర్తుచేస్తూ, చిరుధాన్యాలు సులభంగా పెరగగలవని, వాతావరణాన్ని కరువును తట్టుకోగలవని ప్రధానమంత్రి తెలియజేశారు. మిల్లెట్స్ పండించడం రైతులకు, సమాజానికి అలాగే వాతావరణానికి ఎంతోమేలు చేకూరుస్తుంది. వాస్తవానికి తృణధాన్యాల వినియోగం గత పది సంవత్సరాలుగా దారుణంగా పడిపోయింది. ఒకప్పుడు దక్షిణాది రాష్ట్రాలు, ఒరిస్సా, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లో రాగులు, కొర్రలు, సజ్జలు, జొన్నలు ఆహారంగా ఉండేది. పదిసంవత్సరాల కిందట 8.6 లక్షల హెక్టార్లలో తృణధాన్యాలు పండించేవారు, ఇప్పుడు కేవలం 1.86 లక్షల హెక్టార్లకు పరిమితమైంది. రైతు ప్రయోజనాల గ్రూపు అలాగే రాష్ట్రాల మిల్లెట్ బోర్డులు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది.

దేశంలో రెండు విడతలుగా 25కోట్ల భూప్రమాణాల కార్డులు ఇచ్చామని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. అయితే రైతులకు ఎంతమేరకు ఉపయోగపడుతుందో తెలుస్తూనే ఉంది. గత నాలుగు సంవత్సరాలుగా ఒక్కటంటే ఒక్క భూసార పరీక్షా చేపట్టని రాష్ట్రాలు ఉన్నాయి. చాలా రాష్ట్రాల్లో సేంద్రియ కర్బనం పూర్తిగా తగ్గింది. పర్యావరణ వ్యవస్థ అనగా భౌతిక వ్యవస్థలు లేదా జీవక్రియలకు అస్థిరత, అసమానత, హాని లేదా అసౌకర్యం కలిగించే విధంగా కలుషితాలను పర్యావరణంలోకి విడుదల చేస్తున్నాయి. జాతీయ మట్టిసర్వే భూ వినియోగ ప్రణాళికసంస్థ వారు స్థానిక సాగుభూముల తీరుతెన్నులు, వాతావరణ పరిస్థితులను బట్టి ఏయే పంటలు సాగుచేసుకుంటే ఫలితం బాగుంటుందని సూచనలు ఇస్తున్నారు. ఈ మధ్య వారు ప్రచురించిన నివేదికలో తెలుగు రాష్ట్రాల్లోని భూముల్లో సేంద్రియ కర్బనం అడుగంటిందని, ఇప్పటికైనా ప్రభుత్వం, రైతులు జాగ్రత్తపడి సేంద్రియ కర్బనాన్ని కనీసం 0.7 కైనా పెంచుకోకపోతే భూములు సాగు యోగ్యం కాకుండా పోతాయని హెచ్చరించారు. భూమిని నమ్ముకోవడం అంటే, పంట భూములు ప్రకృతి, సేంద్రియ వ్యవసాయంచేస్తూ సేంద్రియ కర్బనాన్ని పెంపొందించుకోవడం. భూమి ఆరోగ్యానికి సేంద్రియ కర్బనం ఒక ముఖ్య సూచిక. మన భూముల్లో 0.5 శాతం కన్నా సేంద్రియ కర్బనాన్ని పెంపొందించడం కష్టసాధ్యమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అయితే, రసాయనిక ఎరువులకు పూర్తిగా స్వస్తి పలికి ప్రకృతి, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తున్న కొందరు రైతులు మాత్రం 2.0శాతం వరకు పెంచుకోవడం సాధ్యమేనని నిరూపిస్తున్నారు. తక్కువ ఖర్చుతో, స్వల్పకాలంలోనే సేంద్రియ కర్బనాన్ని పెంచుకునే అనేక మార్గాలున్నాయని సూచిస్తున్నారు. శ్రమ తక్కువ ఫలితం ఎక్కువగా ఉండాలని రైతులు భయంకరమైన గడ్డి మందుల వినియోగం చేపడుతున్నారు.

కలుపు మొక్కల నివారణకు కూలీలు దొరకడం కష్టసాధ్యం. అలాగే దొరికినా ఎక్కువ కూలీ అడగడంతో గిట్టుబాటు కాక సంవత్సరంవరకు కలుపు రాకుండా ఉండడానికి గడ్డి, తుంగ, పార్థీనియం, పూలగడ్డి, గారభ తదితర నివారణకు ప్రత్యామ్నాయం లేక భూమి నిస్సారమైన పర్వాలేదు బాగుపడతానేమో అనే మూర్ఖపు పట్టుదలతో రైతులు ఉన్నారు. భూమిపై డైనింగ్ టేబుల్‌వద్ద వైవిధ్యం ఆవశ్యకతను, పౌష్టికాహార లోపంగురించి నిరంతరం చెబుతున్న ఆహార శాస్త్రవేత్తల హెచ్చరికలను సలహాలను ప్రభుత్వం తుంగలో తొక్కింది. వ్యవసాయం ఏకపంటగా మారితే మన ఆరోగ్యం దెబ్బతింటుంది. ఆహార వైవిధ్యాన్ని పెంచడానికి తృణధాన్యాలు మంచి మార్గమని సూచించినా ప్రయోజనం లేదు. రైతులకు ప్రోత్సాహకాలు, అలాగే మంచివిత్తనం కనీసమద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గ్రామాల్లో పాడి తక్కువై జొన్న, సజ్జ, రాగి, కొర్ర పంట తక్కువైంది. అయితే కొంతమంది వ్యక్తులు తమ ఆహారంలో మిల్లెట్‌లను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్య స్పృహ కుటుంబానికి అనుకూలమైన ఎంపికలను చేసుకుంటున్నారు. మానవులు పండించిన తొలిపంటలలో మిల్లెట్‌లకు అద్భుతమైన చరిత్రఉంది. వారు గతంలో ఒక ముఖ్యమైన ఆహారవనరుగా ఉంది. అయితే వాటిని భవిష్యత్తుకోసం ఆహార ఎంపికగా మార్చడం ఈ కాలపు అవసరం.

ఈ శతాబ్దానికి సంభవించిన మహమ్మారి సంఘర్షణ పరిస్థితులను అనుసరించి ఆహారభద్రత ఇప్పటికీ ఆందోళన కలిగిస్తున్న అంశమే. వాతావరణమార్పు ఆహార లభ్యత కూడా ప్రభావితం చేస్తుంది. ఈ సమయంలో, మిల్లెట్లకు సంబంధించిన ప్రపంచ ఉద్యమం ఒక ముఖ్యమైన దశ. ఎందుకంటే తృణధాన్యాలు పెరగడం సులభం, వాతావరణాన్ని తట్టుకోగలవు. చిరుధాన్యాలు వినియోగదారునికి, సాగుదారునికి, వాతావరణానికి మేలు చేస్తాయి. ప్రజలకు, వినియోగదారులకు సమతుల్య పోషణ గొప్ప మూలం. సాగుదారులకు భూమి సారవంతమవుతుంది. అలాగే మన పర్యావరణానికి ప్రయోజనం చేకూరుస్తాయి. ఎందుకంటే వాటికి తక్కువ నీరు అవసరం. సహజ వ్యవసాయ విధానాలకు అనుకూలంగా ఉంటుంది. భూమిపై మన పట్టికలలో వైవిధ్యం అవసరం. వ్యవసాయం ఏక పంటగా మారితే, అది మన ఆరోగ్యం, మన భూముల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. వ్యవసాయ ఆహార వైవిధ్యాన్ని పెంచడానికి మిల్లెట్ మంచి మార్గం. 'మిల్లెట్ మైండ్ ఫుల్‌నెస్' సృష్టించడానికి అవగాహన పెంచడం, ప్రజలకు మంచి ఆరోగ్య, ఆహార పద్ధతులు ఒక ఉద్యమంలా ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం ఉంది. సంస్థాగత యంత్రాంగాలు మిల్లెట్ల ఉత్పత్తిని ప్రోత్సహిస్తాయి. విధాన కార్యక్రమాల ద్వారా దానిని లాభదాయకంగా మార్చగలవు.

వ్యక్తులు తమఆహారంలో మిల్లెట్‌లను భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్య స్పృహ కలుగుతుంది. వీటిని భారత ఉపఖండంలో ఎక్కువగా పండిస్తారు. వీటిల్లో ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు ఫైబర్‌లతో సమృద్ధిగా ఉంటాయి. మిల్లెట్లకు తక్కువ నీరు, నేల సంతానోత్పత్తి అవసరం. మిల్లెట్ల స్థోమతను బట్టి వాటిని "పేదవారి ఆహార ధాన్యం"గా పరిగణిస్తారు. ప్రపంచం ఇప్పుడు మిల్లెట్‌లను వాటి అపారమైన సామర్థ్యం కోసం గమనిస్తోంది. భారతదేశం 170 లక్షల టన్నుల కంటే ఎక్కువ ఉత్పత్తితో మిల్లెట్లకు ప్రపంచ కేంద్రంగా మారడానికి ప్రణాళికలు రూపొందించాలి. ఆసియాలో భారత్ మిల్లెట్ల ఉత్పత్తిలో అగ్రగామిగా నిలువడానికి కృషిచేయాలి. సింధు నాగరికతలో ఈ ధాన్యాలకు సంబంధించిన తొలి ఆధారాలు కనుగొన్నారు. అలాగే ఆహారంకోసం పెంపకం చేసిన మొదటి మొక్కలలో ఇవి ఒకటి. ఇవి దాదాపు 131 దేశాలలో సాగవు తున్నాయి. ఆసియా, ఆఫ్రికాలో సుమారు 60 కోట్ల మందికి సాంప్రదాయ ఆహారం తృణధాన్యాలే. ఇంత మేలు కలిగిన చిరుధాన్యాల సాగు కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమైంది. రెండు తెలుగు రాష్ట్రాలలో రైతుకు సరైన విత్తనం ఇవ్వడం లేదు. రైతులకు విత్తనం అందుబాటులో లేక సుదూర ప్రాంతాల నుండి తెచ్చుకుంటున్నారు. రైతు భరోసా కేంద్రాలలో, రైతు వేదికలల్లో తృణధాన్యాలు దొరకడం లేదు. మిల్లెట్స్ సంవత్సరం 2023 సురక్షితమైన, స్థిరమైన ఆరోగ్యకరమైన భవిష్యత్తు దిశగా సామూహిక ఉద్యమాన్ని ప్రారంభించాలని పౌరసమాజం, అలాగే ప్రభుత్వం ఆకాంక్షించాలి.

డా. ముచ్చుకోట సురేష్‌బాబు, అధ్యక్షులు, ప్రజాసైన్స్‌వేదిక

ఆన్‌లైన్‌లోనే ఆధార్ చిరునామా నవీకరణ

- కుటుంబ పెద్దల సమ్మతి... రుజువు పత్రాలు అవసరం
- యూఐడీఏఐ వెల్లడి

న్యూఢిల్లీ : ఇప్పుడు నివాసితులు తమ కుటుంబ పెద్దల సమ్మతితో ఆన్‌లైన్‌లో ఆధార్‌లోని చిరునామాలను నవీకరణ చేసుకోవడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) అనుమతించినట్లు మంగళవారం అధికారిక ప్రకటన తెలిపింది. రేషన్ కార్డు, మార్కుల షీటు, వివాహ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ మొదలైన సంబంధాల రుజువును సమర్పించిన తర్వాత, దరఖాస్తుదారు, కుటుంబ పెద్ద, ఇద్దరి పేరు, వారి మధ్య సంబంధాన్ని పేర్కొన్న తర్వాత కొత్త ప్రక్రియను ప్రారంభించవచ్చు. ప్రక్రియకు కుటుంబ పెద్ద ద్వారా ఓటీపీ ఆధారిత ప్రమాణీకరణ అవసరం.

కుటుంబ పెద్దతో సంబంధాల రుజువు పత్రం అందుబాటులో లేనట్లయితే, యూఐడీఏఐ సూచించిన నిర్దిష్ట రూపంలో కుటుంబ పెద్ద ద్వారా స్వీయ ధ్రువీకరణ సమర్పించవచ్చు. అలాగే వారి ఆధార్‌లోని చిరునామాను నవీకరించేందుకు వారి స్వంత పేరు మీద సహాయక పత్రాలు లేని పిల్లలు, జీవిత భాగస్వామి, తల్లిదండ్రులు మొదలైన నివాసితుల బంధువులకు ఆధార్‌లో కుటుంబ పెద్ద ఆధారిత ఆన్‌లైన్ చిరునామా నవీకరణ చేస్తుందని, దేశంలోని వివిధ కారణాల వల్ల ప్రజలు నగరాలు, పట్టణాలకు తరలి వస్తున్నందున ఇటువంటి సౌకర్యం లక్షలాది మందికి ప్రయోజనకరంగా ఉంటుందని ఆ ప్రకటన పేర్కొంది. యూఐడీఏఐ నిర్దేశించిన ఏదైనా చెల్లుబాటయ్యే చిరునామా పత్రాన్ని ఉపయోగించి చిరునామాను నవీకరించడానికి కొత్త ఎంపిక ప్రస్తుత చిరునామా నవీకరణ సౌకర్యానికి అదనంగా ఉంటుంది. '18 ఏళ్లు పైబడిన ఏ నివాసి అయినా ఈ ప్రయోజనం పొందేందుకు ఈ ప్రక్రియ ద్వారా అతని లేదా ఆమె బంధువులతో అతని లేదా ఆమె చిరునామాను పంచుకోవచ్చు' అని వివరించింది. నివాసితులు ఆన్‌లైన్ చిరునామాలను నవీకరించుకునేందుకు 'మై ఆధార్' పోర్టల్‌ని సందర్శించవచ్చు. దీనిని అనుసరించి, ధ్రువీకరించిన కుటుంబ పెద్ద ఆధార్ సంఖ్యను నమోదుకు అనుమతి ఉంటుంది. కుటుంబ పెద్దకు చెందిన ఆధార్‌కు తగినంత గోప్యతను నిర్వహించడానికి కుటుంబ పెద్ద ఆధార్ ఇతర సమాచారం పోర్టల్ స్క్రీన్‌పై కనపడదు. కుటుంబ పెద్ద ఆధార్ నంబర్ విజయవంతమైన ధ్రువీకరణ తర్వాత, నివాసి సంబంధ రుజువును అప్‌లోడ్ చేయవలసి ఉంటుంది. 'నివాసితులు ఈ సేవ కోసం రూ. 50 రుసుము చెల్లించాలి. విజయవంతమైన చెల్లింపుపై, సేవా అభ్యర్థన సంఖ్య (ఎస్ఆర్ఎన్) నివాసితో భాగస్వామ్యం అవుతుంది. చిరునామా అభ్యర్థన గురించి సంక్షిప్త సందేశం పంపిస్తారు. 'కుటుంబ పెద్ద అభ్యర్థనను ఆమోదించాలి. నోటిఫికేషన్ స్వీకరించిన తేదీ నుంచి 30 రోజులలోపు మై ఆధార్ పోర్టల్‌కు లాగిన్ చేయడం ద్వారా అతని లేదా ఆమె సమ్మతిని తెలియజేసిన తర్వాత అభ్యర్థన ప్రక్రియ చేయబడుతుంది' అని ప్రకటన పేర్కొంది. కాగా కుటుంబ పెద్ద అతని చిరునామాను పంచుకోవడానికి తిరస్కరిస్తే లేదా ఎస్ఆర్ఎన్ సృష్టించిన నిర్ణీత 30 రోజులలోపు అంగీకరించకపోతే లేదా తిరస్కరించినట్లయితే, అభ్యర్థన ముగిసిపోతుంది. నివాసి, ఈ ఎంపిక ద్వారా చిరునామా నవీకరణ కోరుతూ, అభ్యర్థన మూసివేత గురించి సంక్షిప్త సందేశం ద్వారా తెలియజేస్తారు. కుటుంబ పెద్ద అంగీకరించనందున అభ్యర్థన మూసివేసినా లేదా తిరస్కరించినా లేదా ప్రక్రియ సమయంలో తిరస్కరణకు గురైనా దరఖాస్తుదారుకు మొత్తం తిరిగి చెల్లించబడదని ఆ ప్రకటన పేర్కొంది.

ప్రొస్టేట్ క్యాన్సర్ చికిత్సకు జెనరిక్ ఔషధం



న్యూఢిల్లీ: ప్రోస్టేట్ క్యాన్సర్ చికిత్సలో ఉపయోగించే అపలుటమైడ్ ఔషధం జెనరిక్ వెర్షన్‌ను భారత్‌లో విడుదల చేసినట్లు బీడీఆర్ ఫార్మాస్యూటికల్ సంస్థ మంగళవారం తెలిపింది. మెటాస్టాటిక్ కాస్ట్రేషన్ సెన్సిటివ్ ప్రోస్టేట్ క్యాన్సర్, నాన్-మెటాస్టాటిక్ క్యాస్ట్రేషన్ రెసిస్టెంట్ ప్రోస్టేట్ క్యాన్సర్ రెండింటికీ చికిత్స చేయడానికి భారత్‌లో అపాటైడ్ బ్రాండ్ కింద ఈ ఔషధాన్ని విడుదల చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఔషధం 60ఎంజి సామర్థ్యంతో 60 మాత్రలు, 120 మాత్రల చొప్పున రెండు ప్యాక్‌లలో అందుబాటులో ఉంటుంది. బీడీఆర్ గ్రూప్ డైరెక్టర్ బిజినెస్ డెవలప్‌మెంట్ రహీల్ షా మాట్లాడుతూ... రోగుల భద్రతతో పాటు గుణాత్మక ప్రమాణాలతో రాజీ పడకుండా సరసమైన ధరలకు మందులను అందుబాటులో ఉంచడంలో తమ నిబద్ధతకు అపాటైడ్ విడుదల నిదర్శనమని పేర్కొన్నారు.

ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుమిత్రాసేన్ కన్నుమూత

కోల్‌కతా: ప్రముఖ రవీంద్ర సంగీత విద్వాంసురాలు సుమిత్రా సేన్ కన్నుమూశారు. 89 ఏళ్ల సేన్ బ్రోంకో-న్యుమోనియాతో బాధపడుతూ డిసెంబర్ 21న ఆసుపత్రిలో చేరారు. సోమవారం ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ఆమె మంగళవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. 'అమ్మ ఈ ఉదయం మమ్మల్ని విడిచిపెట్టింది' అని ఆమె కుమార్తె శ్రబానీ సేన్ ఫేస్‌బుక్ పోస్ట్‌లో వెల్లడించారు. ఆమె కుమార్తెలు - శ్రబాని, ఇంద్రాణి ప్రముఖ రవీంద్ర సంగీత గాయనీమణులు. ఇంద్రాణి మాట్లాడుతూ తన తల్లి గత రెండు రోజులుగా మాట్లాడటం మానేసిందని, అయితే సోమవారం సాయంత్రం వరకు అందరినీ గుర్తించగలిగే స్థితిలో ఉన్నట్లు చెప్పారు. కాగా సేన్ మరణం సంగీత ప్రపంచానికి తీరని లోటు అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సంతాపం తెలిపారు. 'దశాబ్దాల పాటు ప్రేక్షకులను ఉర్రూతలూగించిన సుమిత్రా సేన్ ఆకస్మిక మరణం పట్ల నేను చాలా బాధపడ్డాను. ఆమెతో నాకు చాలా కాలంగా సన్నిహిత సంబంధం ఉంది. ఆమె మృతి సంగీత ప్రపంచానికి తీరని లోటు. సుమిత్రా కుమార్తెలు ఇంద్రాణి, శ్రబాని ఆమె అభిమానులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని మమత సంతాప సందేశంలో పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2012లో సుమిత్రాసేన్‌ను 'సంగీత మహాసమ్మాన్' పురస్కారంతో సత్కరించింది. సుమిత్రా సేన్ ఆలపించిన చిరస్మరణీయమైన గేయాల్లో 'మేఘ్ బోలేచే జబో జబో', 'తోమారీ జర్నతలర్ నిర్జోనే', 'సఖీ భబోనా కహరే బోలే', 'అచ్చే దుఖో అచ్చే మృత్యు' వంటివి ఉన్నాయి. సేన్ దక్షిణ కోల్‌కతాలోని బల్లిగంజ్ సర్క్యులర్ రోడ్‌లో గల ఒక అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నారు. ఆమె మరణ వార్త తెలియగానే పెద్ద సంఖ్యలో గాయకులు, సంగీత కళాకారులు, సంగీత అభిమానులు తరలివచ్చారు.

యుద్ధాన్ని కోరుకోం: రాజ్‌నాథ్



బోలెంగ్ (అరుణాచల్ ప్రదేశ్): దేశ భూభాగాన్ని పరిరక్షించేందుకు సరిహద్దు వెంబడి ఎదురయ్యే సవాళ్లను తిప్పికొట్టే సత్తా భారత్‌కు ఉందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. మంగళవారంనాడిక్కడ బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) నిర్మించిన 27 ఇతర మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో పాటు సియోమ్ వంతెనను ప్రారంభించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... భారత్ ఎప్పుడూ యుద్ధాన్ని ప్రోత్సహించదని, పొరుగు దేశాలతో ఎల్లప్పుడూ సత్సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటుందని అన్నారు. అయితే సరిహద్దు వెంబడి ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనే సత్తా భారత సైన్యానికి ఉందని, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. 'భారతదేశం ఎప్పుడూ యుద్ధాన్ని ప్రోత్సహించని దేశం...పొరుగు దేశాలతో ఎల్లప్పుడూ సత్సంబంధాలను కొనసాగించాలని కోరుకుంటుంది... రెచ్చగొడితే ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనే సత్తా దేశానికి ఉంది' అని సింగ్ అన్నారు. సున్నిత సరిహద్దు ప్రాంతాలలో భారత సాయుధ దళాల కదలికలు సులభతరం చేయడానికి 724 కోట్ల వ్యయంతో 28 ప్రాజెక్టులు నిర్మించినట్లు స్పష్టం చేశారు. దేశాల ప్రాధాన్యతలు, ఆసక్తులు ఎప్పటికప్పుడు మారుతాయని రాజ్‌నాథ్ అన్నారు. ఏ దేశమైనా తనను తాను శక్తి వంతంగా ఉంచుకోవడం అవసరమని చెప్పారు. ఇది యుద్ధ యుగం కాదని ప్రధాని మోడీ చెప్పిన సందర్భాన్ని గుర్తు చేస్తూ... యుద్ధం మీద తమకు నమ్మకం లేదని తెలిపారు. ఒకవేళ అలాంటి ప్రయోగం ఎవరైనా చేస్తే ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు.

యూపీలోకి 'భారత్ జోడో యాత్ర'

డోలు దరువులు... దేశభక్తి గీతాలతో స్వాగతం

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేపట్టిన 'భారత్ జోడో యాత్ర' మంగళవారం ఢిల్లీ నుంచి తిరిగి ప్రారంభమై మధ్యాహ్నం ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశించడంతో కశ్మీరీ గేట్ నుంచి ఘజియాబాద్ వైపు వెళ్లే మార్గం త్రివర్ణ పతాకాలు, బెలూన్లతో అలంకృతమైంది. యమునా బజార్‌లోని హనుమాన్ మందిర్ వద్దకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు చేరుకోవడంతో అక్కడ నుంచి యాత్ర తిరిగి ప్రారంభమైంది. జెండాలు, బ్యానర్లు పట్టుకుని 'భారత్ జోడో' నినాదాలు చేశారు. పార్టీ కార్యకర్తలు దేశభక్తి గీతాలు ఆలపిస్తూ, డప్పు దరువుల మధ్య యాత్రలో చేరారు. వారు ఉత్తరప్రదేశ్ వైపు వెళుతున్నారు. ఘజియాబాద్ వైపు వెళ్లే మార్గంలో అనేక పాయింట్ల వద్ద కాంగ్రెస్ కార్యకర్తలు, సభ్యులు క్యాంపులు ఏర్పాటు చేశారు. దారి పొడవునా అనేకచోట్ల చిన్నపాటి సాంస్కృతిక కార్యక్రమాలు కూడా నిర్వహించారు. చాలా మంది యాత్రికులు రాహుల్ గాంధీ చిత్రం ఉన్న తెల్లటి టీ-షర్టులు ధరించి కనిపించగా, మరికొందరు యాత్రలో త్రివర్ణ కండువా మెడకు చుట్టుకున్నారు. యాత్రను చూసేందుకు చాలా మంది పౌరులు రోడ్డు, వారి ఇంటి డాబాలపై గుమిగూడారు. పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరించారు. యాత్రకు సురక్షితంగా మార్గాన్ని అందించడానికి అనేక ప్రదేశాలలో రహదారులపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఉత్తరప్రదేశ్ సరిహద్దులోని లోనికి సమీపంలో జెండా అప్పగింత కార్యక్రమం జరిగిన ప్రాంతంలో భద్రతా ఏర్పాట్లను పెంచారు. దేశ రాజధానికి చేరుకోవడానికి ముందు, పాదయాత్ర డిసెంబరు 21-23 మధ్య రాష్ట్రంలోని నుహ్, గురుగ్రామ్, ఫరీదాబాద్ జిల్లాల గుండా హరియాణాలో 130 కిలోమీటర్లకు పైగా ప్రయాణించింది. ఈ యాత్ర సెప్టెంబర్ 7న కన్యాకుమారి నుంచి ప్రారంభమైంది. అప్పటి నుంచి మొదటి దశలో తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, హరియాణా, ఢిల్లీ మీదుగా సాగింది. కాగా యాత్ర రెండు రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లో ఉంటుంది. గురువారం సాయంత్రం నాటికి హరియాణాలోని పానిపట్‌లోకి ప్రవేశిస్తుంది. పంజాబ్‌ను దాటి ఒక రోజు హిమాచల్ ప్రదేశ్ మీదుగా యాత్ర జమ్ముకశ్మీర్‌లోకి ప్రవేశిస్తుంది. అక్కడ ముగుస్తుంది.

బల్వాన్‌కు బెయిల్‌పై సీబీఐకి సుప్రీం నోటీసు



న్యూఢిల్లీ: సిక్కు వ్యతిరేక అల్లర్ల కేసులో జీవితఖైదు శిక్ష అనుభవిస్తున్న కాంగ్రెస్ మాజీ కౌన్సిలర్ బల్వాన్ ఖోకర్ బెయిల్ అభ్యర్థనపై సమాధానం చెప్పాల్సిందిగా సుప్రీంకోర్టు మంగళవారం సీబీఐని కోరింది. తాను ఇప్పటికే 9 ఏళ్లుగా జైలులో మగ్గుతున్నానని, తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ బల్వాన్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇదే కేసులో బల్వాన్‌తో పాటు కాంగ్రెస్ మాజీ ఎంపీ సజ్జన్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మహేందర్ యాదవ్‌కు కూడా జైలు శిక్ష పడిన విషయం విదితమే. తాను అంగవికలుడినని, ఇప్పటికే 8 ఏళ్ల 10 నెలలుగా జైలులో ఉన్నానని తెలుపుతో బల్వాన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ అభయ్ ఎస్ ఒకాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. దీనిపై నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని ధర్మాసనం సీబీఐకి నోటీసులు జారీ చేసింది. ఆరోగ్య కారణాలతో సజ్జన్‌కుమార్‌కు తాత్కాలిక బెయిల్ లేదా పెరోల్ ఇవ్వడానికి సుప్రీంకోర్టు 2020 మేలో నిరాకరించింది. 2018 డిసెంబరులో ఢిల్లీ హైకోర్టు శిక్ష విధించిన తర్వాత సజ్జన్‌కుమార్, బల్వాన్‌లను తీహార్ జైలుకు తరలించారు.

జేపీ నడ్డా పదవీకాలం పొడిగింపు?

16, 17న బీజేపీ కార్యవర్గం భేటీ

న్యూఢిల్లీ: బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పదవీకాలం పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. జనవరి 16, 17 తేదీల్లో జరిగే బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో నడ్డా పదవీకాలం పొడిగింపుపై నిర్ణయం తీసుకుంటారని పార్టీ వర్గాలు మంగళవారం వెల్లడించాయి. దీనితోపాటు త్వరలో జరగనున్న కొన్ని అసెంబ్లీలు ఎన్నికలు, 2024 సార్వత్రిక ఎన్నికల సన్నద్ధత, వ్యూహాలపై సమావేశం చర్చిస్తుందని వివరించాయి. నడ్డా మూడేళ్ల పదవీకాలం జనవరి చివరికి పూర్తి కానున్నది. రానున్న ఎన్నికల దృష్ట్యా నడ్డా పదవీకాలం పొడిగించడానికే ఎక్కువ అవకాశాలు కనిపిస్తున్నట్లు పార్టీ వర్గాలు స్పష్టంచేశాయి. భారత్‌లో జీ 20 సమావేశాల నిర్వహణపైనా సమావేశం సుదీర్ఘంగా చర్చించవచ్చని తెలుస్తోంది. జీ 20 సమావేశాల నిర్వహణకు కార్యాచరణ రూపొందించడం, వీటి విజయవంతంలో పార్టీని భాగస్వామ్యం చేయడంపైనా చర్చించవచ్చని సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పనితీరు, కేంద్ర ప్రభుత్వం పనితీరుపైనా సమావేశం చర్చిస్తుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. రానున్న అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పార్టీ సంస్థాగత ఎన్నికల వాయిదాపైనా చర్చ జరగవచ్చని, పార్టీలో అంతర్గత ఎన్నికల ప్రక్రియ లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉండవచ్చని తెలిపాయి. 2019 లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా అమిత్‌షా పదవీకాలం కూడా నాడు పొడిగించిన విషయం విదితమే. నాడు లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే బీజేపీ సంస్థాగత ఎన్నికలు ప్రారంభమయ్యాయి. బీజేపీ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అమిత్‌షా కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టారు.

ఢిల్లీని కప్పేసిన పొగమంచు

రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో రెండ్రోజుల పాటు తగ్గినట్లు కనిపించిన పట్టిన చలి గాలులు, పొగమంచు మళ్లీ తీవ్రమయ్యాయి. ఎముకలు కొరికే చలి పరిస్థితులను అధిగమించడానికి ప్రజలు రోడ్ల వెంట చలిమంటల వేసుకుంటున్నారు. పొగమంచు కారణంగా రవాణ వ్యవస్థ ఆలస్యంగా ముందుకు సాగుతోంది. దేశ రాజధాని ఢిల్లీని పొగమంచు కప్పేసింది. దీంతో విమానాలు, రైళ్లు, వాహనాల రాకపోకలపై ప్రభావం పడింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో మంగళవారం ఉదయం దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో విమానాశ్రయం అధికారులు ప్రయాణికులకు హెచ్చరిక జారీ చేశారు. ఢిల్లీలో ప్రతికూల వాతావరణం కారణంగా సోమవారం రాత్రి ఐదు విమానాలను జైపూర్‌కు మళ్లించినట్లు విమానాశ్రయ అధికారి తెలిపారు. పొగమంచు ప్రభావం వల్ల విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడిందని, దీన్ని విమాన ప్రయాణికులు గుర్తించాలని విమానాశ్రయం అధికారులు ట్వీట్ చేశారు. విమానాశ్రయానికి వచ్చే ముందు విమానాల రాకపోకల సమయాలను తనిఖీ చేసుకోవాలని కోరారు. పొగమంచుతో కారణంగా కనీసం 21 రైళ్లు ఒకటిన్నర నుంచి ఐదు గంటలు ఆలస్యంగా నడుస్తున్నాయని రైల్వే అధికార ప్రతినిధి పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల పాటు ఢిల్లీలో ఒక మోస్తరు నుంచి దట్టమైన పొగమంచు కురిసే అవకాశం ఉందని, కనిష్ఠ ఉష్ణోగ్రత 4 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవచ్చని, చలిగాలులు వీస్తాయని భారత వాతావరణశాఖ (ఐఎండీ) హెచ్చరించింది. ఇదే సమయంలో దేశంలో రానున్న రోజుల్లో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే అత్యంత కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. వాయువ్య భారతదేశంలోని మైదాన ప్రాంతాలలో రాబోయే నాలుగు రోజుల పాటు శీతల పరిస్థితులు ఉండవచ్చని ఐఎండీ అంచనా వేసింది. పంజాబ్, హరియాణా, చండీగఢ్, ఉత్తరప్రదేశ్, బీహార్‌లలో రానున్న 5 రోజుల్లో తీవ్ర పొగమంచు, చలిగాలులతో కూడిన శీతల పరిస్థితులు కొనసాగే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. దక్షిణ ద్వీపకల్పంలోని దక్షిణ ప్రాంతాలు, ఈశాన్య భారతదేశంలోని అనేక ప్రాంతాలు, వాయువ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ కనిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. 'ఈశాన్య భారతదేశంలోని చాలా ప్రాంతాలు, వాయువ్య, తూర్పు, తూర్పు మధ్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది' అని పేర్కొంది. వాయువ్య భారతదేశంలో (తూర్పు ఉత్తరప్రదేశ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్,లడఖ్) ఈ నెలలో వర్షాలు కురిసే అవకాశముందని ఐఎండీ అంచనా వేసింది.

పెరిగిన బొగ్గు ఉత్పత్తి: కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో బొగ్గు ఉత్పత్తి పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ ఏడాది ఏప్రిల్-డిసెంబరు కాలంలో 16.39శాతం ఉత్పత్తి పెరిగిందని, అంటే 607.97 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలిపింది. గత ఏడాది ఇదే కాలంలో భారత్‌లో బొగ్గు ఉత్పత్తి 522.34 మిలియన్ టన్నులని వెల్లడించింది. ప్రభుత్వ రంగ కోల్ ఇండియాలో 479.05 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి జరిగిందని, ఇది గతేడాదితో పోలిస్తే 15.82శాతం అధికమని బొగ్గు మంత్రిత్వశాఖ ఓ ప్రకటనలో వివరించింది. దీంతో మార్కెట్‌లోకి అదనంగా బొగ్గు పంపడానికి మార్గం సుగమమైందని తెలిపింది. ప్రభుత్వం తీసుకున్న అనేక చర్యలు, సంస్కరణల కారణంగా ఇది సాధ్యమైందని చెప్పుకొచ్చింది.

కోడిని జంతువుగా చూడటం విడ్డూరం

గుజరాత్ ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

అహ్మదాబాద్: మాంసం దుకాణాలకు కోళ్ల సరఫరాపై నిషేధం విధించాలని కోరుతూ దాఖలైన పిల్‌పై గుజరాత్ హైకోర్టు మంగళవారం ఆ రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసు జారీ చేసింది. నిబంధనల ప్రకారం కబేళాకు పంపడానికి బదులుగా వాటిని దుకాణాల్లోనే వధిస్తున్నారని పిటిషనర్ పేర్కొన్నారు. అయితే మటన్ షాపులో కోడిని వధించరాదని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందని, పౌల్ట్రీ పక్షిని జంతువుగా పరిగణించవచ్చా అని ప్రధాన న్యాయమూర్తి అరవింద్ కుమార్, న్యాయమూర్తి అశుతోష్‌శాస్త్రితో కూడిన ధర్మాసనం పేర్కొంది. దీనికి సంబంధించి ప్రతివాదులు - రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధక డైరెక్టర్, ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) కమిషనర్, మునిసిపల్స్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది.

ఈ అంశంపై తగిన సమయంలో విచారణ చేపట్టాలంటూ వాయిదావేసింది. పౌల్ట్రీ పక్షులను జంతువులుగా పరిగణించి మాంసం దుకాణానికి తీసుకురావడానికి ముందు వాటిని కబేళాకు పంపించాలా అని పిల్ దాఖలు చేసిన స్వచ్ఛంద సంస్థలు యానిమల్ వెల్ఫేర్ ఫౌండేషన్, అహింసా మహా సంఘ్‌లను ఉన్నత న్యాయస్థానం ప్రశ్నించింది. పక్షులను వధశాలలకు పంపాల్సిన అవసరం లేదు... కోడిని జంతువుగా పరిగణించవచ్చా? చికెన్ విషయంలో, ఇది మంచి చికెన్ , ఇది చెడ్డ చికెన్ అని మీరు ఎలా వేరు చేస్తారు? అని పేర్కొంది. కాగా పిటిషనర్ తరపు న్యాయవాది నిసర్గ్ మెహతా మాట్లాడుతూ... జంతువులపై క్రూరత్వ నిరోధక (స్లాటర్ హౌస్) నిబంధనలలోని రూల్ 3ని ఉదహరించారు.

లైసెన్స్ పొందిన వధశాలల్లో మినహా మరెక్కడా జంతువులను వధించరాదని ఈ నిబంధన చెబుతోంది.

ఉద్ధవ్‌దే 'నిజమైన శివసేన'

రాజ్యసభ సభ్యుడు సంజయ్ రౌత్

ముంబై : ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని బృందాన్ని 'నిజమైన శివసేన' అని శివసేన (ఉద్ధవ్ థాకరే) నాయకుడు సంజయ్ రౌత్ సోమవారం నొక్కి చెప్పారు. రెండు ప్రత్యర్థి గ్రూపుల ఏకీకరణ కోసం థాకరే ఆత్మపరిశీలన చేసుకోవాలని ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని బాలాసాహెబంచి శివసేన అధికార ప్రతినిధి దీపక్ కేసర్కర్ ఆదివారం సూచనను తిరస్కరించారు. రౌత్ విలేకరులతో మాట్లాడుతూ, ఆత్మపరిశీలన అవసరం లేదని, అలాంటి సూచన ప్రత్యర్థి వర్గం నిరాశను చూపుతుందని అన్నారు. 'అతని (కేసర్కర్) సూచన నిరాశ నుంచి వచ్చింది. ద్రోహులను విధానసభకు లేదా లోక్‌సభకు పంపకూడదని రాష్ట్ర ప్రజలు నిర్ణయించారు. 'ఉద్ధవ్ థాకరే నేతృత్వంలోని శివసేన నిజమైన శివసేన. ద్రోహులు ఆత్మపరిశీలన చేసుకోమని అడుగుతుంటే, అది కష్టం. ఆత్మపరిశీలన అవసరం లేదు. ఉద్ధవ్ నేతృత్వంలోని శివసేన గతంలో ఎలా ఎదుగుతుందో అలాగే పెరుగుతోంది' అని ఆయన అన్నారు. షిండే శిబిరంలో ఒకదానితో ఒకటి విభేదించే గ్రూపులు ఉన్నాయని రౌత్ పేర్కొన్నారు. 'ఈ (షిండే నేతృత్వంలోని) ప్రభుత్వం కొనసాగదు. సగం మంది ఎమ్మెల్యేలు బీజేపీలో చేరతారు. అది వారి లక్ష్యం, ఎందుకంటే శివసేన వారిని అంగీకరించదు. వారికి వేరే మార్గం లేదు' అని తెలిపారు. థాకరే వర్గం కేసు చట్టపరంగా బలంగా ఉన్నందున 16 మంది ఎమ్మెల్యేలు (షిండే వర్గానికి చెందిన) అనర్హులు అవుతారని రౌత్ వివరించారు. వీరి అనర్హత పిటిషన్ సుప్రీంకోర్టు ముందు ఉంది.

మాజీ ఐపీఎస్ పిటిషన్‌పై 10న సుప్రీం విచారణ

న్యూఢిల్లీ: గుజరాత్ హైకోర్టులో అప్పీల్ కోసం అదనపు ఆధారాలు ఇవ్వాలని కోరుతూ మాజీ ఐపీఎస్ అధికారి సంజీవ్ భట్ పిటిషన్‌పై జనవరి 10న విచారణ జరపడానికి సుప్రీంకోర్టు మంళవారం అంగీకరించింది. 1990లో జరిగిన లాకప్ డెత్ కేసులో తనకు విధించిన శిక్షను సవాల్ చేస్తూ భట్ హైకోర్టులో అప్పీల్ చేశారు. విచారణ నుంచి జస్టిస్ షాను తొలగించాలని భట్ కోరుకుంటున్నారా అని జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సీటీ రవికుమార్‌తో కూడిన ధర్మాసనం భట్ తరపు న్యాయవాది దేవదత్త కామత్‌ను ప్రశ్నించింది. న్యాయమూర్తికి పక్షపాతం ఆపాదించాలని కోరుకోవడం లేదని, అయితే, పక్షపాతం జరిగే అవకాశం ఉందని భయపడుతున్నట్లు కామత్ వివరించారు. కేసు విచారణను జనవరి పదికి ధర్మాసనం వాయిదా వేసింది.

కేబినెట్‌లోకి చెరియన్

ఆమోదించిన కేరళ గవర్నరు



తిరువనంతపురం: కేబినెట్ మంత్రిగా సాజి చెరియన్‌ను తిరిగి తీసుకోవాలన్న ముఖ్యమంత్రి పినరయి విజయన్ సిఫార్సును ఆమోదించినట్లు కేరళ గవర్నరు ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ మంగళవారం తెలిపారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సీపీఎం నేత చెరియన్ కొంతకాలం క్రితం మంత్రి పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి సలహాకు తాను కట్టుబడి ఉన్నానని గవర్నరు చెప్పారు. గవర్నరు ఖాన్ మంగళవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చెరియన్‌ను కేబినెట్‌లో చేర్చుకోవాలని సీఎం సిఫార్సు చేశారని, దీని గురించి తానే మీడియాతో మాట్లాడటం సరికాదని చెప్పారు. 'అంతిమంగా సీఎం సిఫార్సును ఆమోదించాను. చెరియన్ బుధవారం మంత్రిగా ప్రమాణం చేస్తారు. సీఎం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని నిన్న కూడా నేను చెప్పాను' అని ఖాన్ తెలిపారు. చెరియన్‌ను కేబినెట్‌లోకి తీసుకోవడం అంత తేలిక కాదని చెప్పిన మరుసటి రోజే గవర్నరు ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు చెరియన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

బీజేపీకి నటి గాయత్రి రాజీనామా



చెన్నై: రాజకీయవేత్తగా మారిన సినీనటి గాయత్రి రఘురామ్ బీజేపీకి గుడ్ బై చెప్పారు. బీజేపీకి రాజీనామా చేసినట్లు ఆమె మంగళవారం ప్రకటించారు. తమిళనాడు బీజేపీలో మహిళలకు రక్షణ లేదని, నిజమైన కార్యకర్తలను ఎవరూ పట్టించుకోరని ఆమె ఆరోపించారు. బీజేపీని వదలడానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై కారణమని ఆమె నిందించారు. అయితే, గాయత్రి ఆరోపణలపై బీజేపీ సీనియర్ నేత ఒకరు తోసిపుచ్చారు. ఆమె పార్టీ వీడటం వల్ల నష్టమేమీ లేదని చెప్పారు. గాయత్రి ఆరోపణలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. గాయత్రిని నవంబరు 23న పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. 'మహిళలకు గౌరవం లేదు. నాపై వచ్చిన ఆరోపణపై విచారణ చేయలేదు. పార్టీలో సమాన హక్కులు లేవు. అందుకే బీజేపీకి రాజీనామా చేయాలని నిర్ణయం తీసుకున్నా. అన్నామలై నాయకత్వంలో మహిళకు రక్షణ లేదు' అని గాయత్రి ట్విట్టర్ వేదికగా విమర్శలు గుప్పించారు. ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లకు ట్యాగ్ చేశారు.

ఆహార భద్రత ఓ హక్కు

- రేషన్‌లో 50 శాతం కోత
- పేదలకు మోదీ ఇచ్చే కానుక
- కాంగ్రెస్ విమర్శలు

న్యూఢిల్లీ: ఆహార భద్రత భారతీయుల హక్కు, కానుక కాదని కాంగ్రెస్ నొక్కిచెప్పింది. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) అమలు తమ ఘనత అన్నట్లు మోదీ ప్రభుత్వం గొప్పలుపోవడం తగదని హితవు పలికింది. దేశంలోని 81కోట్ల మంది పేదలకు ఇచ్చే రేషన్‌లో 50శాతం కోత విధించి కొత్త సంవత్సరం సందర్భంగా ప్రధాని మోదీ గొప్ప కానుక ఇచ్చారంటూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. పేదలకిచ్చే పది కేజీల ఆహార ధాన్యాలను మోదీ ప్రభుత్వం ఐదు కేజీలకు తగ్గించారన్నారు. 'ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ యోజన (పీఎంజీకేఏవై)ని ఆపేస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో 2023 సంవత్సరం నిరాశగా మొదలైంది. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ) కింద లబ్ధిదారులకు పీఎంజీకేఏవై కింద అదనంగా ఐదు కేజీల ఆహార ధాన్యాలు అందేవి. రేషన్‌లో 50శాతం కోతపై మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నది. పార్లమెంటులోగానీ రాష్ట్రాల ప్రభుత్వాలతోగానీ చర్చించలేదు' అని రమేశ్ అన్నారు. 2023లో అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద నిరుపేద కుటుంబాల (పీహెచ్‌హెచ్)కు 35కేజీలు అంటే ఒక్కొక్కరికి ఐదు కేజీలు లెక్కన ఆహార ధాన్యాలను ఉచితంగా అందజేస్తారని కేంద్రమంత్రి పీయూష్ గోయల్ ప్రకటించారు. దీనిపై జైరాం రమేశ్ స్పందిస్తూ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కింద పేదలకు ఐదు కేజీల ఆహార ధాన్యాలు ఇస్తుండటం చరిత్రాత్మక నిర్ణయం అన్నట్లుగా మోదీ ప్రభుత్వం గొప్పలు పోతోందని దుయ్యబట్టారు. ఇలాంటివాటి ద్వారా ప్రధానంగా లబ్ధి పొందినది మోదీ ప్రభుత్వమే అని, లక్షకోట్ల రూపాయాలను ఆదా చేసుకున్నదన్నారు. రేషన్ కార్డుదారుల ఖర్చును పెంచిందని చెబుతూ ఐదుగురు ఉన్న కుటుంబానికి నెలసరి రూ.750 అంటే ఏడాదికి రూ.9వేలు వరకు అదనంగా ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ప్రధానిని 'యూ టర్న్ ఉస్తాద్' అని అన్నారు. యూపీఏ హయంలోని ప్రవేశపెట్టిన ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ, ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ వంటి పథకాలను వ్యతిరేకించి ఇప్పుడేమో వాటికి ఘనత పొందుతున్నారని విమర్శించారు. ఆకలి సూచీలో భారత్ అధ్వాన్నంగా ఉన్నదన్నారు. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కానుక కాదని భారత ప్రజల హక్కు అని నొక్కిచెప్పారు. పీఎంజీకేఏవై నిలుపుదల ద్వారా ఆదా అయ్యే లక్షకోట్ల రూపాయలను ఆహార భద్రతా వ్యవస్థలను బలపర్చేందుకు వినియోగించాలని మోదీ ప్రభుత్వాన్ని ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని జైరాం రమేశ్ అన్నారు. ఆహార భద్రతా వ్యవస్థల బలోపేతానికి మూడు విధానాలను సూచించారు. అందులో మొదటిది... 2021 గణనలో మితిమీరిన తాత్సారం వల్ల రేషన్ కార్డులకు అర్హులుగా మినహాయించిన 10కోట్ల మందిని వెంటనే ఆ జాబితాలో చేర్చడం, రేషన్ కార్డులు లేకపోయినా వలస కార్మికులు అందరికీ రేషన్ పంపిణీ చేయడం. ఈ మేరకు సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. మాతాశిశు సంక్షేమం క్రమంలో బిడ్డకు రూ.6వేలు చొప్పున ఎన్‌ఎఫ్‌ఎస్‌ఏ కింద అందజేస్తారు. మొదటి బిడ్డకు రూ.5వేలు మాత్రమే ప్రభుత్వమిస్తోంది. ఇలాంటి ఉల్లంఘనలను మోదీ ప్రభుత్వం తక్షణమే అరికట్టాలి' అని జైరాం రమేశ్ వెల్లడించారు.

సావిత్రి భాయి పూలే ఆదర్శం

అక్కినేని వనజ, దుర్గాభవాని

విశాలాంధ్ర-విజయవాడ: అస్పృశ్యత, అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రజలను చైతన్య పరిచి స్త్రీ విద్య వికాసానికి కృషి చేసిన సంఘ సంస్కర్త సావిత్రి భాయి పూలే మహిళా లోకానికి ఆదర్శమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని అన్నారు. సావిత్రి పూలే జయంతిని ఏపీ మహిళా సమాఖ్య నగర సమితి మంగళవారం నిర్వహించింది. దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయులు అయిన సావిత్రి స్మారకార్థం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని వనజ, దుర్గాభవాని కోరారు. స్త్రీ చదువుకుంటే ఆ కుటుంబం మొత్తం చైతన్యమైనట్లేనన్నారు. మహిళా సమాఖ్య నగర కార్యదర్శి పంచదార్ల దుర్గాంబ, అధ్యక్షులు ఓర్సు భారతి, మాజీ కార్పొరేటర్ తమ్మిన దుర్గ, నాయకులు దుర్గాసి రమణమ్మ, ఆర్.అనసూర్య, చింతాడ పార్వతి, రాహేలమ్మ, బీసు శాంత, పుష్పవతి, అండమాని నాగమణి, ఝాన్సీ, కావ్య తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ యోధుడు: ప్రియాంక

ఘజియాబాద్: కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాద్రా మంగళవారం తన సోదరుడు రాహుల్ గాంధీని 'యోధుడు' అని అభివర్ణించారు. అతని ప్రతిష్టను నాశనం చేయడానికి వేల కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వ బలానికి తాను భయపడడని అన్నారు. ఢిల్లీ నుంచి ఉత్తరప్రదేశ్‌లోకి ప్రవేశించిన రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రను లోనీ సరిహద్దులో స్వాగతిస్తూ, అదానీ, అంబానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తలు చాలా మంది రాజకీయ నాయకులను, పీఎస్‌యూలను, మీడియాను కొనుగోలు చేసి ఉండవచ్చు. కానీ వారు నా సోదరుడిని కొనలేరు. ఎప్పటికీ చేయలేరు' అని తెలిపారు. రాహుల్ గాంధీకి చలికాలంలో కూడా చలి అనిపించదని ప్రజలు అంటున్నారని, దీనికి కారణం 'అతను సత్యం అనే కవచాన్ని ధరించడం' అని కాంగ్రెస్ నాయకురాలు తెలిపారు. కాగా ఢిల్లీలో చలికాలంలో కూడా తెల్లటి టీ షర్టులు ధరించి యాత్రలో కనిపించిన రాహుల్ గాంధీకి ఎందుకు చలిగా అనిపించడం లేదని మీడియాతో పాటు రాజకీయ నాయకులు కూడా ఆశ్చర్యపోతున్నారు. కన్యాకుమారి నుంచి 3,000 కిలోమీటర్లు ప్రయాణించి యూపీలోకి ప్రవేశించిన యాత్రను స్వాగతిస్తున్నందుకు గర్వంగా ఉందని ప్రియాంక అన్నారు. 'అన్నయ్య చూడు, నేను నిన్ను గురించి గర్వపడుతున్నాను. ఎందుకంటే ప్రభుత్వం నీపై ఒత్తిడి పెట్టింది. నీ ప్రతిష్టను నాశనం చేసేందుకు వేల కోట్లు ఖర్చు పెట్టింది' అని అన్నారు. 'కానీ, అతనిని సత్య మార్గం నుంచి అరికట్టలేదు. ఏజెన్సీలను మోహరించారు. కానీ అతను ఒక యోధుడు అయినందున భయపడలేదు' అని ఆమె ఇక్కడి లోని సరిహద్దు వద్ద ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఉత్తర ప్రదేశ్ ఇన్‌ఛార్జి ప్రియాంక వాద్రా అన్నారు. 'ద్వేషాల మార్కెట్‌లో ప్రేమను వ్యాప్తి చేయడానికి రాహుల్ 'షాప్' తెరిచారని, ప్రజలను ఏకం చేయడానికి పాదయాత్ర చేస్తున్నారని అన్నారు. 'ఈ 'మొహబ్బత్ కి దుకాన్' (ప్రేమను పంచడానికి దుకాణం) ఫ్రాంచైజీని తెరవాలని నేను ఉత్తరప్రదేశ్‌లోని ప్రతి ఒక్కరినీ కోరుతున్నాను' అని ఆమె చెప్పారు.

ప్రస్తుతానికి అక్కర్లేదు...

కోవిడ్ రెండో బూస్టర్, నాల్గో టీకాపై కేంద్రవర్గాలు

న్యూఢిల్లీ: కొన్ని దేశాల్లో కోవిడ్ కొత్తరకం కలకలం రేపుతున్న దృష్ట్యా భారత్‌లో వాక్సిన్‌ల పంపిణీపై అధికారులు దృష్టిపెట్టారు. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు చేపట్టినప్పటికీ రెండో బూస్టర్ డోసు, నాల్గో టీకా పంపిణీ ప్రస్తుతానికి కేంద్రప్రభుత్వ అజెండాలో లేవని అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి. దేశంలో చాలా మంది మూడో టీకా తీసుకోలేదని, నాల్గో టీకా అవసరం ప్రస్తుతానికి లేదన్నాయి. 2022 జనవరి నాటికి భారత జనాభాలో 28శాతం మంది బూస్టర్ డోసులు తీసుకున్నారు. అమెరికా, బ్రిటన్ వంటి దేశాలలో మూడవ, నాల్గవ బూస్టర్ డోసుల పంపిణీ జరుగుతోంది. దేశంలోని ఆరోగ్య సంరక్షణ, ఫ్రంట్‌లైన్ వర్కర్లకు నాల్గో టీకా ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని ఐఎంఏ ప్రతినిధులు, సీనియర్ వైద్యులు ఇటీవల కేంద్ర ఆరోగ్యమంత్రి మన్సుఖ్ మాండవియాను కోరారు. చైనా, జపాన్, దక్షిణ కొరియా, థాయిలాండ్ వంటి దేశాల్లో కేసులు పెరుగుతున్న దృష్ట్యా ఈ సమావేశం గతేడాది డిసెంబరు 26న జరిగింది.

సకాలంలోనే ఉద్యోగాల భర్తీ

- గవర్నర్ విశ్వభూషణ్ సూచన
- ఏపీపీఎస్సీ వార్షిక నివేదిక ఆవిష్కరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉద్యోగుల నియామకాలు సకాలంలో పూర్తి అయ్యేలా సత్వర చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ)కు గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ సూచించారు. ఆయన మంగళవారం ఏపీపీఎస్సీ (2021-22) నివేదికను ఆవిష్కరించారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగాల ప్రకటనల కోసం నిరీక్షించే యువత ఆకాంక్షలకనుగుణంగా వేగవంతమైన చర్యలు అవశ్యమని నొక్కిచెప్పారు. న్యాయపరమైన వివాదాలతో నియామకాల్లో సమస్యలు ఎదురవుతున్నట్లు గవర్నర్‌తో కమిషన్ చైర్మన్ గౌతమ్ సవాంగ్ అన్నారు. సంస్థ కార్యకలాపాలను ఆయనకు వివరించారు. శీఘ్రమే మరికొన్ని ఉద్యోగాల ప్రకటనలు ఇచ్చేలా ప్రయత్నిస్తున్నామని చెప్పారు. 2018లో 165 గ్రూప్-1 పోస్టుకు నోటిఫికేషన్ ఇచ్చి 2022 జులైలో నియామకాల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. వీరిలో 30 మంది డిప్యూటీ కలెక్టర్లు, 28 మంది డీఎస్పీలు ఉన్నారన్నారు. 2022, సెప్టెంబర్ 30న 92 గ్రూప్ 1పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామని, ప్రిలిమినరీ స్క్రీనింగ్ టెస్ట్ 2023, జనవరి 8న జరుగుతుందని చెప్పారు. 2021కి ముందున్న పెండింగ్ నోటిఫికేషన్‌లకు సంబంధించి నియామకాలు పూర్తి అయ్యాయని సవాంగ్ అన్నారు. 2021-22లో 24 నోటిఫికేషన్లు రాగా నియామకాలు కొనసాగుతున్నాయని తెలిపారు. 190 అసిస్టెంట్ ఇంజనీర్ల పోస్టులు భర్తీ కాగా మిగిలినవీ గడువులోగా భర్తీ చేస్తామన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా, పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు కె.విజయకుమార్, అచార్య పద్మరాజు, డాక్టర్ జీవీ సుధాకర్‌రెడ్డి, ఏవీ రమణారెడ్డి, పి.సుధీర్, ఎన్ సోనీఉడ్, ఎన్.సుధాకర్ రెడ్డి, రాజ్‌భవన్ సంయుక్త కార్యదర్శి సూర్య ప్రకాశ్ పాల్గొన్నారు.

ఒకటో తేదీనే వేతనాలు

ఎస్టీయూ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఉద్యోగులు, ఉపాధ్యాయు లకు జీతాలు ప్రతినెలా 1వ తేదీనే చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డిమాండ్ చేసింది. డిసెంబరు వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరింది. మంగళవారం మంగళగిరి రాష్ట్ర ఖజానా కార్యాలయ సంచాలకులు ఎన్.మోహన్‌రావును ఎస్టీయూ అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న కలిశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 13లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు జీతాల కోసం, పింఛన్‌దారులు పెన్షన్లు కోసం ఎదురుచూస్తున్నార న్నారని, వారందరికీ ప్రతి నెలా క్రమంగా సకాలంలో జీతాలు-పింఛన్లు అందేలా చూడాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. జీతాలు ఆలస్యమైతే సంక్రాంతి సంబరాలు జరుపుకునే పరిస్థితి ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ఉండదన్నారు. గతేడాదిలో ఉద్యోగులు, ఉపాధ్యాయుల భవిష్యనిధి రుణాలు, మెచ్యూరిటీ తదితరాలు పెండింగ్ ఉండగా వాటి చెల్లింపు తేదీ ప్రకటించాలని కోరారు. ఎన్.మోహన్‌రావును కలిసిన వారిలో ఎస్టీయూ నేతలు ఎస్.రామచంద్రయ్య, కాకుమాను జోజప్ప, వి.ప్రసాదరావు ఉన్నారు.

కొత్త లుక్‌లో కళ్యాణ్‌రామ్



హైదరాబాద్: నందమూరి కళ్యాణ్‌రామ్ నటిస్తున్న అమిగోస్ చిత్రం షూటింగ్ ఇటీవలే పూర్తయింది. రాజేందర్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను జరుపుకుంటోంది. మైత్రీ సంస్థ నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 10న విడుదల కానుంది. ఈ క్రమంలో చిత్రబృందం సినిమా గూర్చిన విశేషాలను పంచుకుంటూ సినిమాపై ఆసక్తిని పెంచుతున్నారు. ఈ సినిమాలో కళ్యాణ్‌రామ్ త్రిపాత్రాభినయం చేస్తుండగా, అందులో మొదటి రోల్‌కు సంబంధించిన పోస్టర్‌ను న్యూఇయర్ సందర్భంగా రిలీజ్ చేశారు. తాజాగా రెండో రోల్‌కు సంబంధించిన పోస్టర్‌ను చిత్రబృందం రిలీజ్ చేసింది. మొదటి పోస్టర్‌లో వ్యాపారవేత్తగా సిద్ధార్థ్ పాత్రలో స్టైలిష్ లుక్‌లో కనిపించిన కళ్యాణ్‌రామ్... సెకండ్ పోస్టర్‌లో సాఫ్ట్‌వేర్‌గా మంజునాథ్ పాత్రలో అమాయకంగా కనిపిస్తున్నాడు. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కళ్యాణ్‌రామ్‌కు జోడీగా అశికా రంగనాథ్ హీరోయిన్‌గా నటించింది. జిబ్రాన్ సంగీత అందించారు. సంక్రాంతి తర్వాత ఈ సినిమా ప్రమోషన్‌లు జోరుగా జరుపాలని మైత్రీ సంస్థ భావిస్తోంది.

ఫిబ్రవరిలో 'మైఖేల్'

హైదరాబాద్: టాలీవుడ్ యంగ్ హీరో సందీప్ కిషన్ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. అందులో 'మైఖేల్' ఒకటి. పాన్ ఇండియా రేంజ్‌లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు రంజిత్ జయకోడి దర్శకత్వం వహిస్తున్నాడు. ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుండగా, ఇప్పటికే చిత్రబృందం రిలీజ్ చేసిన పోస్టర్‌లు, టీజర్ సినిమాపై విపరీతమైన అంచనాలు నెలకొల్పాయి. తాజాగా మేకర్స్ ఈ సినిమా రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 3న విడుదల చేస్తున్నట్లు పోస్టర్‌ను విడుదల చేశారు. కాగా ఇండస్ట్రీలో ఫిబ్రవరి నెలను డ్రై మంత్ అంటుంటారు. మరీ ఈ డ్రై నెల సందీప్‌కు కమర్షియల్ హీరో స్టేటస్‌ను తెచ్చిపెడుతుందా? లేదా? అనేది చూడాలి. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో విజయ్ సేతుపతి కీలకపాత్ర పోషిస్తున్నాడు. ప్రముఖ దర్శకుడు, నటుడు గౌతమ్ వాసుదేవ మీనన్ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నాడు. సందీప్‌కు జోడీగా దివ్యాంశ కౌశిక్ నటించింది. వరలక్ష్మీ శరత్‌కుమార్, వరుణ్‌తేజ్, అనసూయ కీలకపాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వరా సినిమాస్ ఎల్‌ఎల్‌పి, కరణ్ సి ప్రొడక్షన్స్ బ్యానర్లపై పుస్కూర్ రామ్‌మోహన్ రావు, భరత్ చౌదరీలు సంయుక్తంగా నిర్మించారు.

ఎన్టీఆర్ జోడీగా జాన్వీ కపూర్?

హైదరాబాద్: ఎన్టీఆర్ తన 30వ సినిమాను కొరటాల శివ దర్శకత్వంలో చేయనున్నాడు. ఇప్పటికే సెట్స్ పైకి వెళ్లవలసిన ఈ సినిమా, కొన్ని కారణాల వలన ఆలస్యమైంది. 'ఆర్ ఆర్ ఆర్'తో ఎన్టీఆర్ కి వచ్చిన పాన్ ఇండియా క్రేజ్ కి తగినట్టుగా స్క్రిప్ట్ ను మార్చడానికి కొరటాల కాస్త ఎక్కువ సమయాన్ని తీసుకున్నాడనేది ఎక్కువగా వినిపించిన టాక్. ఎన్టీఆర్ ఆర్ట్స్ - యువసుధ ఆర్ట్స్ వారు కలిసి భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాకి ఇంకా టైటిల్ ను నిర్ణయించలేదు. వచ్చేనెల నుంచి రెగ్యులర్ షూటింగు మొదలుకానుంది. ఈ సినిమాలో కథానాయికగా కొంతమంది పేర్లు వినిపిస్తూ వచ్చాయి. ఆ జాబితాలో శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ పేరు కూడా ఉంది. అయితే తెలుగు సినిమాలకి సంబంధించి ఆమె పేరు చాలా కాలంగా నానుతూ ఉండటం వలన, జనాలకు అంత నమ్మకం కలగలేదు. కానీ ఈ సినిమాకి జాన్వీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే టాక్ బలంగానే వినిపిస్తోంది. త్వరలోనే ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటిస్తారని అంటున్నారు. అనిరుధ్ సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ సినిమాను, 2024 ఏప్రిల్ 5వ తేదీన విడుదల చేయనున్నారు.

రోహిత్, కోహ్లీపై అతిగా ఆధారపడితే

టీమిండియాకు ప్రపంచకప్ దక్కదు: కపిల్



న్యూఢిల్లీ: టీమిండియా తాజా మాజీ సారథులు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపై అతిగా ఆధారపడటం మానేస్తే తప్ప టీమిండియాకు ఐసీసీ వన్డే ప్రపంచకప్ దక్కదని భారత దిగ్గజ క్రికెటర్ కపిల్‌దేవ్ తేల్చేశాడు. రోహిత్, కోహ్లీ దాదాపు కెరీర్ చరమాంకంలో ఉన్నారు. ఈ ఇద్దరూ ధోని సారథ్యంలో వన్డే ప్రపంచకప్ నెగ్గిన జట్టులో ఉన్నారే గానీ వీరి సారథ్యంలో అది అందని ద్రాక్షగానే మిగిలింది. భారత క్రికెట్ జట్టు చివరిసారి 2013లో ఐసీసీ ట్రోఫీ నెగ్గింది. మహేంద్ర సింగ్ ధోని సారథ్యంలోని భారత జట్టు ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న తర్వాత పదేళ్లుగా ప్రతీసారి భారత జట్టు ఐసీసీ టోర్నీలో పాల్గొనడం, ఉత్తచేతులతోనే తిరిగిరావడం ఆనవాయితీగా మారింది. ధోని వారసుడిగా వచ్చిన విరాట్ కోహ్లీ... భారత్ కు ఐసీసీ ట్రోఫీ అందిస్తాడని ఆశించినా అతడి వల్ల కాలేదు. కోహ్లీ కాకున్నా ఐదు ఐపీఎల్ ట్రోఫీలు గెలిచిన రోహిత్ శర్మ అయినా భారత్ కు ఐసీసీ ట్రోఫీ బెంగ తీరుస్తాడనుకుంటే అతడూ చేతులెత్తేశాడు. ఈ ఇద్దరూ కలిసి భారత్ లో ఈ ఏడాది జరుగబోయే వన్డే ప్రపంచకప్ లో భారత్ కు కీలకంగా వ్యవహరించనున్నారు. జరిగేది భారత్ లోనే కాబట్టి ఈ ఇద్దరు దిగ్గజాల కల ఈ యేటితో నెరవేరుతుందని టీమిండియా అభిమానులు గంపెడాశలు పెట్టుకున్నప్పటికీ అలాంటిదేమీ జరగదని, కోహ్లీ...రోహిత్ లు భారత్ కు ప్రపంచకప్ తీసుకురాలేరని, వాళ్లిద్దరి మీద అతిగా ఆధారపడటం మానేస్తే తప్ప టీమిండియాకు ఐసీసీ ట్రోఫీ దక్కదని తన సారథ్యంలో దేశానికి తొలి వన్డే వరల్డ్ కప్ (1983) అందించిన కపిల్ స్పష్టం చేశాడు. ఓ వార్తా సంస్థతో కపిల్ దేవ్ మాట్లాడుతూ... 'ఒకవేళ మీరు ప్రపంచకప్ గెలవాలనుకుంటే హెడ్ కోచ్, సెలక్టర్లు, టీమ్ మేనేజ్‌మెంట్ కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవాలి. వ్యక్తిగత ఆసక్తులను పక్కనబెట్టి జట్టు గురించి ఆలోచించాలి. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి ఇద్దరు ముగ్గురు ప్లేయర్ల మీద భారం వేసి వాళ్లను వరల్డ్ కప్ తీసుకురమ్మంటే అది జరగని పని... మీరు మీ టీమ్ పై పూర్తి నమ్మకముంచాలి. మనకు అసలు అలాంటి టీమ్ ఉందా..? గుండె మీద చేయి వేసుకుని వీళ్లు మ్యాచ్ ను గెలిపించగలరనే మ్యాచ్ విన్నర్లు ఉన్నారా..? జట్టులో కొందరు బాగా ఆడుతున్నారు. కానీ ఒకరిద్దరి మీదో ఆధారపడితే ఐసీసీ వంటి టోర్నీలలో రాణించలేం. కనీసం జట్టులో ఆరుగురు దాకా మ్యాచ్ విన్నర్లు ఉంటే అప్పుడు ఫలితాలు ఆశించిన విధంగా వస్తాయి. జట్టును అలా తయారుచేయాలి. విరాట్, రోహిత్ లను వదిలేయండి, యువకులు ముందుకురావాలి. వాళ్ల బాధ్యతలు తీసుకోవాలి' అని కపిల్ వ్యాఖ్యానించాడు.

రిషబ్ పంత్ ఓ ఫైటర్

త్వరగా కోలుకోవాలి: టీమిండియా

ముంబై: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ స్టార్ వికెట్, కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ త్వరగా కోలుకోవాలని భారత క్రికెట్ జట్టు ఆకాంక్షించింది. కోచ్ రాహుల్ ద్రవిడ్‌తో పాటు కెప్టెన్ హార్దిక్ పాండ్యా సహా జట్టులోని ఇతర ఆటగాళ్లు శ్రీలంకతో సిరీస్‌కు ముందు పంత్‌కు సందేశాలు పంపారు. ఈ మేరకు బీసీసీఐ మంగళవారం ట్విట్టర్‌లో వీడియోను పోస్ట్ చేసింది. కోచ్ రాహుల్‌తో పాటు జట్టు సభ్యులు పంత్‌ను ఫైటర్‌గా అభివర్ణించారు. 'నువ్వు ఛాంపియన్‌వి, త్వరగా కోలుకుంటావు' అని తెలిపారు. గత శుక్రవారం రూర్కీలో రిషబ్ పంత్ రోడ్డు ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పంత్ పూర్తిగా కోలుకునేందుకు దాదాపు ఆరు నెలల పాటు సమయం పడుతుందని భావిస్తున్నారు. బీసీసీఐ విడుదల చేసిన వీడియో హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ మాట్లాడుతూ.. 'రిషబ్ క్షేమంగా ఉన్నావని, త్వరగా కోలుకుంటావని ఆశిస్తున్నాను. గత ఏడాది కాలంలో మనం కలిసిపని చేసే అవకాశం వచ్చింది. భారత టెస్టు చరిత్రలో క్లిష్ట పరిస్థితుల్లో ఎన్నో మరపురాని ఇన్నింగ్స్‌ను ఆడావు. వాటి నుంచి ఎలా బయటపడాలో నీకు తెలుసని నాకు తెలుసు. ఇది ఓ సవాల్, నువ్వు తిరిగి వస్తావు' అని ద్రవిడ్ పేర్కొన్నాడు.

'ఢిల్లీ క్యాపిటల్స్' డైరెక్టర్‌గా గంగూలీ?

న్యూఢిల్లీ: బీసీసీఐ అధ్యక్షుడిగా రెండేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించిన సౌరవ్ గంగూలీ, తిరిగి ఐపీఎల్‌లో ఎంట్రీ ఇవ్వబోతున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కి డైరెక్టర్‌గా బాధ్యతలు తీసుకోబోతున్నాడు. గంగూలీ బీసీసీఐ అధ్యక్షుడు కావడానికి ముందు ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్‌కి హెడ్ కోచ్‌గా, మెంటార్‌గా వ్యవహరించాడు. ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో పాటు ఐఎల్ టీ20 (ఇంటర్నేషనల్ లీగ్ టీ20) దుబాయ్ క్యాపిటల్స్, అలాగే సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో ప్రెటోరియా క్యాపిటల్స్ టీమ్‌కి కూడా గంగూలీ డైరెక్టర్‌గా వ్యవహరించబోతున్నాడు. 'అవును, సౌరవ్ గంగూలీ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌లోకి రాబోతున్నారు. ఆయనతో జరుపుతున్న చర్చలు తుదిదశకు చేరుకున్నాయి. త్వరలో అధికారిక ప్రకటన వస్తుంది. ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్‌తో ఆయన పనిచేశారు, ఈ ఫ్రాంచైజీతో ఆయనకు ప్రత్యేక అనుబంధం ఉంది. అందుకే ఆయన్ని ఒప్పించాం' అని ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంఛైజీ సభ్యులు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ టీమ్ ముందున్న ప్రధాన సమస్య రిషబ్ పంత్ స్థానంలో కొత్త కెప్టెన్‌ని ఎంపిక చేయడం. గత రెండు సీజన్లలో ఢిల్లీ క్యాపిటల్స్‌కి కెప్టెన్‌గా వ్యవహరించిన రిషబ్ పంత్, కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. అతను కోలుకోవడానికి కనీసం 6 నెలల సమయం పడుతుందని సమాచారం. రిషబ్ పంత్ స్థానంలో డేవిడ్ వార్నర్‌కి కెప్టెన్సీ అప్పగిస్తారా? లేక అండర్19 వరల్డ్ కప్ విన్నింగ్ కెప్టెన్ పృథ్వీ షాకి కెప్టెన్సీ పగ్గాలు ఇస్తారా? అనేది ఆసక్తిగా మారింది. ఇప్పుడు ఢిల్లీక్యాపిటల్స్ తర్వాతి కోచ్‌ని నిర్ణయించే బాధ్యత సౌరవ్ గంగూలీపైనే పడింది.

వన్డే జట్టులో బుమ్రా...లంక సిరీస్‌కు ఎంపిక

ముంబై: టీమిండియా అభిమానులకు శుభవార్త. కొన్నాళ్లుగా క్రికెట్‌కి దూరంగా ఉన్న జస్ప్రిత్ బుమ్రా జట్టులోకి పునరాగమనం చేశాడు. ఆసియా కప్ 2022 టోర్నీకి ముందు గాయపడిన జస్ప్రిత్ బుమ్రా... తిరిగి జట్టులోకి వచ్చిన తర్వాత ఒండంటే రెండు మ్యాచులు ఆడి తిరిగి గాయపడ్డాడు. వెన్నుగాయంతో టీ20 వరల్డ్ కప్ 2022 టోర్నీకి కూడా దూరంగా ఉన్న జస్ప్రిత్ బుమ్రా... శ్రీలంకతో జరిగే వన్డే సిరీస్ ద్వారా మళ్లీ బంతి చేతబట్టనున్నాడు. జస్ప్రిత్ బుమ్రాని శ్రీలంకతో వన్డే సిరీస్‌కి ఎంపిక చేసిన జట్టులో చేరుస్తున్నట్టు బీసీసీఐ మంగళవారం ప్రకటించింది. వెన్ను గాయానికి చికిత్స చేయించుకున్న జస్ప్రిత్ బుమ్రా, పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్టుగా జాతీయ క్రికెట్ అకాడమీ క్లియరెన్స్ ఇచ్చింది. దీంతో తిరిగి భారత జట్టులో చోటు దక్కించుకోబోతున్నాడు జస్ప్రిత్ బుమ్రా. గాయం కారణంగా బంగ్లాదేశ్‌తో వన్డే, టెస్టు సిరీస్‌కి దూరమైన మహ్మద్ షమీ కూడా శ్రీలంకతో వన్డే సిరీస్ ద్వారా రీఎంట్రీ ఇవ్వబోతున్నాడు. షమీ, బుమ్రాలతో పాటు మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, అర్ష్‌దీప్ సింగ్ ఫాస్ట్ బౌలర్లుగా ఎంపికయ్యారు. బుమ్రా రాకతో ఉమ్రాన్ మాలిక్ రిజర్వు బెంచ్‌కి పరిమితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వన్డే వరల్డ్ కప్ 2023 టోర్నీకి ఎంపిక చేసిన 20 మంది కోర్ టీమ్‌ని ఎక్కువ మ్యాచులు ఆడించాలని జట్టు మేనేజ్‌మెంట్ భావిస్తోంది. భారత్-శ్రీలంక వన్డే సిరీస్ జనవరి 10 నుంచి మొదలవుతుంది. 10న గౌహతిలో తొలి వన్డే, 12న కోల్‌కత్తాలో రెండో వన్డే, 15న తిరువనంతపురంలో మూడో వన్డే జరగనుంది.

శ్రీలంక సిరీస్‌కు భారత్ జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), శుబ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, సూర్యకుమార్ యాదవ్, కెఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, హార్దిక్ పాండ్యా, వాషింగ్టన్ సుందర్, యజ్వేంద్ర చాహల్, కుల్దీప్ యాదవ్, జస్ప్రిత్ బుమ్రా, మహ్మద్ షమీ, మహ్మద్ సిరాజ్, ఉమ్రాన్ మాలిక్, అర్ష్‌దీప్ సింగ్.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.